aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity – the voice of the people."
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com - 9160600610
VINTAARA INSTITUTE OF TECHNOLOGY
Build Your Dream Career
ADMISSION OPEN
HYDERABAD & VIJAYAWADA & VISAKHAPATNAM & GUNTUR

నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
సోమవారం
29-06-2026 సంపుటి : 01 సంచిక : 98 పేజీలు : 08 వెల : ₹ 5/-
తెలుగు దినపత్రిక

BESQATI
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com

# కూన కుమ్మేసింది

## భారత్‌పై ఐర్లాండ్ చారిత్రక విజయం

- రెండో టీ20లో 1 పరుగు తేడాతో గెలుపు
- 2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన ఐర్లాండ్
- తిలక్ వర్మ అర్ధశతకం వృథా..
- టీ20ల్లో తొలిసారి భారత్‌పై సిరీస్ విజయం

ఐర్లాండ్ చరిత్ర సృష్టించగా, ప్రపంచ చాంపియన్‌కు దారుణ భంగపాటు. పేస్, బౌన్స్‌కు అనుకూలించిన పిచ్‌పై వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైన టీమ్ ఇండియా టీ20 సిరీస్‌ను 0-2తో ఐర్లాండ్‌కు కోల్పోయింది. దీంతో పొట్టి ఫార్మాట్‌లో వరుసగా 12 సిరీస్ విజయాలు సాధించిన భారత్ జైత్రయాత్రకు పసికూన ఐర్లాండ్ బ్రేక్ వేసింది. ఐర్లాండ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 154 పరుగులు చేయగా, హ్యారీ టెక్టర్ (53) అర్ధ సెంచరీతో రాణించాడు. ఛేదనలో తిలక్ వర్మ (55) అర్ధ సెంచరీతో పోరాడినా భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 153 పరుగులే చేసింది. ఒక్క పరుగు తేడాతో ఐర్లాండ్ చేతిలో భారత్ ఓటమి పాలైంది. ఐర్లాండ్ చేతిలో భారత్‌కు ఇది తొలి సిరీస్ ఓటమి.



3లో



## అన్నదాతలకు అండగా 'ప్రజా ప్రభుత్వం'

- 30న చింతకానిలో సీఎం రేవంత్‌రెడ్డి రైతు ఆశీర్వాద సభ
- రైతులకు సంకెళ్లు వేసిన నాటి పాలకులా నేడు ముసలి కన్నీరు కార్చేది
- భారీ వర్షాలొచ్చినా సభ విజయవంతం కావడం ఖాయం
- ఏర్పాట్ల పరిశీలన అనంతరం మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**తెలంగాణ బ్యూరో ప్రతినిధి జూన్ 28 (మహాప్రభ)**
రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సాహసోపేత నిర్ణయాలతో అన్నదాతలకు కొండంత అండగా నిలుస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో ఈనెల 30వ తేదీ మంగళవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్న 'రైతు ఆశీర్వాద సభ' ఏర్పాట్లను పరిశీలించి ఆయన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల భారీ బలగంతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ స్థలాలను అంగుళం అంగుళం వీక్షించి, వాతావరణ మార్పులను తట్టుకునేలా జర్మన్ హ్యాంగర్తో అద్భుతమైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

-మిగతా 3 లో

## ఎస్‌ఎల్ బీసీ- డిండి ప్రాజెక్టులను
# పూర్తి చేస్తాం

### మూసీ ప్రక్షాళనే నా జీవిత లక్ష్యం

- నల్గొండలో రూ.1,306 కోట్ల హైవే పనులకు శంకుస్థాపన
- పేదల సంక్షేమమే నా జీవిత లక్ష్యం: సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు సిద్ధం..బీఆర్ఎస్, బీజేపీకి బహిరంగ సవాల్
- కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం
- ఆర్అండ్‌బీ, జాతీయ రహదారి పనులకు భారీ నిధులు
- తెలంగాణ భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నాం:
- నల్లగొండలో 'ప్రజా పాలన- ప్రగతి పాలన' సభలో సీఎం రేవంత్ రెడ్డి

**నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి జూన్ 28 (మహాప్రభ)**
'నల్లగొండ జిల్లాకు సాగు నీరందించే ఎస్ఎల్‌బీసీ--డిండి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. మూసీ ప్రక్షాళనే నా జీవిత లక్ష్యం. తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమాన ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తున్నాం' అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కనగల్‌లో రూ.1,306 కోట్ల వ్యయంతో హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) విధానంలో చేపట్టనున్న ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ సమీపంలో నల్లగొండ--దేవరకొండ ప్రధాన రహదారిపై ఏర్పాటుచేసిన హ్యామ్ రోడ్డు ప్రాజెక్టు పైలాన్‌ను సీఎం ఆవిష్కరించారు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6092.37 కిలోమీటర్ల మేర 441 రహదారుల విస్తరణ అభివృద్ధి పనులను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం నల్లగొండ పట్టణంలో మంచినీటి పథకాన్ని ప్రారంభించారు.

-మిగతా 3 లో





### బంగారం కొనుగోళ్లు తగ్గించినందుకు
## ధన్యవాదాలు

- పశ్చిమాసియా సంక్షోభాన్ని కలిసికట్టుగా ఎదుర్కొంటున్నాం
- భద్రత స్వయం సమృద్ధి దిశగా భారత్
- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోడీ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ జూన్ 28 (మహాప్రభ)**
పశ్చిమాసియా సంక్షోభంతో ఎదురైన ఉద్రిక్త పరిస్థితుల సమయంలో తాను చేసిన పలు సూచనలకు ప్రజల నుంచి మంచి స్పందన దక్కిందని ప్రధాని మోడీ అన్నారు. ఒక ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను, విదేశీ ప్రయాణాలు తగ్గించుకోవాలని తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఆచరణలో పెట్టిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ప్రసారమైన 135వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే భారత్ సాధించిన పలు కీలక విజయాలను కూడా ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని కలిసికట్టుగా ఎదుర్కొంటున్నట్టు ప్రధాని మోడీ తెలిపారు. ఉద్రిక్త పరిస్థితుల సమయంలో

-మిగతా 3 లో

## పాకిస్థాన్ సైన్యంపై ఉగ్రదాడి..

3లో



- నలుగురు జవాన్‌లు మృతి..
- సైన్యం దాడిలో ఆరుగురు ఉగ్రవాదులు హతం..!
- కరాచీలోని సింధ్ రేంజర్ల స్థావరంపై భీకర ఉగ్రదాడి
- పేలుడు పదార్థాల వాహనంతో దాడికి పాల్పడిన ఉగ్రవాదులు
- దాడికి బాధ్యత వహించిన జమాత్-ఉల్-అహ్రార్ ఉగ్రసంస్థ



## మళ్లీ యుద్ధమేఘాలు!

- నౌకలపై ఇరాన్ దాడికి అమెరికా ప్రతిదాడులు
- ప్రతీకారంగా కువైట్, బహ్రెయిన్‌లపై ఐఆర్‌జీసీ ఎటాక్
- ఇరాన్ అనవాళ్లు కూడా ఉండవని ట్రంప్ వార్నింగ్

3లో

## ప్రజా సంక్షేమమే
# మా ఎజెండా


### మీ అవసరాలే మా ప్రాధాన్యత



- రహదారుల నిర్మాణ కార్యక్రమాన్ని ఒక పండుగల మొదలుపెట్టిన మంత్రి కోమటిరెడ్డి
- అనాటి ప్రభుత్వం అధికార అహంకారంతో ప్రజలను హింసించింది
- మానవీయ కోణంతో ప్రజల అవసరాలను ప్రభుత్వం చేపడుతోంది
- నల్లగొండ బహిరంగసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

**తెలంగాణ బ్యూరో ప్రతినిధి జూన్ 28 (మహాప్రభ)**
"ప్రజా సంక్షేమమే మా ఎజెండా.. ప్రజల అవసరాలే మా ఎజెండా. మీ సమస్యల పరిష్కారానికే ఈ ప్రజా ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తుంది" అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నల్లగొండ ఎన్జీ కళాశాల మైదానంలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ పట్ల నమ్మకంతో నిలబడిన నల్లగొండ, ఖమ్మం జిల్లాల ప్రజల రుణం తీర్చుకునేందుకే తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ నిధులు కేటాయించామని భట్టి విక్రమార్క తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రూ. 13 వేల కోట్లతో

-మిగతా 3 లో



### బంగ్లాదేశ్‌కు తప్పకుండా
## తిరిగి వెళ్తా

- ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసమే నా తిరుగు ప్రయాణం: హసీనా
- మరణశిక్షతో భయపడను.. రాజకీయ కక్షసాధింపేనని ఆరోపణ
- అవామీ లీగ్ మళ్లీ బలంగా పుంజుకుంటుందని హసీనా ధీమా
- బంగ్లాదేశ్‌లో ప్రజల ఆకాంక్షలే నా లక్ష్యం: షేక్ హసీనా
- బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా వెల్లడి

**న్యూఢిల్లీ జూన్ 28 (మహాప్రభ)**
రెండేళ్లకుపైగా ఇండియాలో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కీలక ప్రకటన చేశారు. ఈ ఏడాది ఎలాగైనా తన స్వదేశం తిరిగి వెళ్తానని ప్రకటించారు. ఒకవైపు ఆమెకు ప్రాణహాని ఉన్నా, మరణశిక్ష విధించాలని డిమాండ్లతోపాటు ఆమె పార్టీపై నిషేధం ఉన్నా తను మాత్రం ఈ ఏడాది బంగ్లాదేశ్ తిరిగి వెళ్తానని చెప్పారు. ఆమె పార్టీ అవామీ లీగ్ ఈ ఏడాది జూన్ 23న 77 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో ఇండియాలోని ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక విషయాలు వెల్లడించారు.'నేను బంగ్లాదేశ్ తిరిగి వెళ్లడం నా వ్యక్తిగతమైన లక్ష్యం కోసం కాదు. అది బంగ్లాదేశ్ ప్రజల రాజకీయ ఆకాంక్షల కోసం. అక్కడ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడం కోసం. విముక్తి కోసం జరిగిన పోరాట స్ఫూర్తి కోసం. చట్టాన్ని పరిరక్షించేందు కోసం నేను వెళ్తా. నేను అధికారం కోసం రాజకీయాలు చేయను. బంగ్లాదేశ్ ప్రజల సంక్షేమం కోసం, వారి ఆకాంక్షల్ని నెరవేర్చడం కోసం, బంగ్లా జాతిపిత బంగబంధు షేక్ ముజిబర్ రహమాన్ కలలుగన్న సోనార్ బంగ్లాను సాధించడం కోసమే రాజకీయాలు చేస్తా" అన్నారు. తనకు అక్కడి కోర్టు మరణ శిక్ష విధించడంపై

-మిగతా 3 లో



## పల్స్‌పోలియో
# విజయవంతం

- 38.95 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు పంపిణీ
- రాష్ట్రంలో 95.1 శాతం పూర్తి
- నేడు, రేపు డోర్ టూ డోర్ క్యాంపెయిన్

**హైదరాబాద్ జూన్ 28 (మహాప్రభ)**
రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం జయప్రదమైంది. రాష్ట్రంలో 0-5 ఏండ్ల లోపు పిల్లలు 40,97,749 మంది ఉంటారని అంచనా వేయగా, అందులో 38,95,550 మంది (95.1 శాతం) చిన్నారులకు తొలి రోజే పోలియో చుక్కల పంపిణీ పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన పల్స్ పోలియో బూత్‌లకు పెద్ద ఎత్తున తల్లిదండ్రులు తమ చిన్నారులను తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించడం పట్ల హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సహకారం, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో కార్యక్రమం

-మిగతా 3 లో

# హోటల్ యజమానికి బాలిక విక్రయం..

- 5 రోజుల పాటు 30 మందికిపైగా అత్యాచారం



**జైపూర్ జూన్ 28 (మహాప్రభ)**

ఇంటి నుంచి అదృశ్యమైన బాలికను ఒక వ్యక్తి హోటల్ యజమానికి అమ్మేశాడు. ఈ నేపథ్యంలో ఐదు రోజుల పాటు 30 మందికిపైగా వ్యక్తులు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత బాలిక ఫిర్యాదుతో పలువురు హోటల్ యజమానులు, నిర్వాహకులను పోలీసులు అరెస్ట్ చేశారు. రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్ జిల్లాలో ఈ దారుణం జరిగింది. 13 ఏళ్ల బాలిక తన ఇంటి నుంచి అదృశ్యమైంది. రిక్షా లాగే వ్యక్తి ఆమెను ఒక హోటల్ యజమానికి విక్రయించాడు. ఈ నేపథ్యంలో ఐదు రోజుల పాటు పలు హోటల్స్‌లో ఆ బాలికపై లైంగిక దాడి జరిగింది. సుమారు 30 మందికిపైగా వ్యక్తులు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు.కాగా, బాధిత బాలిక ఈ దారుణం గురించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పదేపదే జరిగిన అత్యాచారాల వల్ల కలిగే బాధను భరించలేనప్పుడు తనతో బలవంతంగా మద్యం తాగించారని ఆమె ఆరోపించింది. దీంతో పోస్కో చట్టంతోపాటు పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. పలువురు హోటల్ యజమానులు, నిర్వాహకులను అరెస్టు చేశారు. మరోవైపు ఈ నేర సంఘటన బయటకు రాకుండా అణచివేసే ప్రయత్నం జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఆగ్రహం వెల్లువెత్తింది. శ్రీ గంగానగర్ ప్రముఖ పర్యాటక ప్రాంతం కానప్పటికీ 150కు పైగా అక్రమ హోటళ్లు ఉన్నాయని స్థానికులు ఆరోపించారు. వాటిని వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ కూడా నిరసనలో పాల్గొన్నది. రిక్షా లాగే వ్యక్తితో పాటు హోటల్ నిర్వాహకులందరిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత పోలీస్ స్టేషన్‌కు చెందిన అధికారులను సస్పెండ్ చేయాలని ఆ పార్టీ నేతలు డిమాండ్ చేశారు.

# సౌదీలో అరాంకో హెలికాప్టర్ కూలి 14 మంది మృతి..

-రస్ తనురా సమీపంలో ఘటన




**న్యూఢిల్లీ జూన్ 28 (మహాప్రభ)**

సౌదీలో ఘోర ప్రమాదం జరిగింది. ప్రముఖ ఆయిల్ సంస్థ అరాంకోకు చెందిన హెలికాప్టర్ కూలిన ఘటనలో 14 మంది మరణించారు. మృతులంతా సౌదీకి చెందిన వారే. ఈ ఘటన సౌదీ అరేబియా ఉత్తర తీరంలోని రస్ తనూరాలో ఆదివారం స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6.00 గంటలకు జరిగింది. ప్రమాదంపై సమాచారం అందుకున్న అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. ఈ ఘటనపై అరాంకో సంస్థ ఇంకా స్పందించలేదు.అయితే, హెలికాప్టర్ ప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రమాద ఘటనకు, మృతులకు సంబంధించిన పూర్తి వివరాలు కూడా ఇంకా తెలియరాలేదు. ఈ ప్రమాదంపై సౌదీ చమురు మంత్రిత్వ శాఖ విచారం వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించింది. సౌదీకి చెందిన చమురు సంస్థ అరాంకో 1934 నుంచి విమానయాన సేవలు కూడా అందిస్తోంది. 2023 నుంచి దీనికి సంబంధించిన సంస్థ పేరును అలౌలా ఏవియేషన్‌గా మార్చారు. ప్రస్తుతం ఈ సంస్థకు విమానాలు, హెలికాప్టర్లు వంటివి కలిపి 60 వరకు ఉన్నట్లు తెలుస్తోంది. సౌదీ అరేబియాలో తీర ప్రాంత రవాణా సేవలు, సరుకుల రవాణా, వైద్య పరమైన తరలింపు సేవలను సంస్త నిర్వహిస్తోంది. మరోవైపు ఫ్రాన్స్‌లో కూడా ఆదివారం ఉదయం 11.00 గంటలకు విమాన ప్రమాదం జరిగింది. స్కైడైవర్ల బృందంతో వెళ్తున్న చిన్న విమానం కూలడంతో 11 మంది మరణించారు. మృతుల్లో ఐదుగురు స్కైడైవింగ్ శిక్షకులు, ఐదుగురు విద్యార్థులు, పైలట్ ఉన్నారు.


# ఫ్రాన్స్‌లో కూలిన విమానం.. 11 మంది మృతి

**న్యూఢిల్లీ జూన్ 28 (మహాప్రభ)**



స్కైడైవర్ల బృందంతో వెళ్తున్న చిన్న విమానం కూలిపోయింది. ఈ ప్రమాదంలో 11 మంది మరణించారు. మృతుల్లో ఐదుగురు శిక్షకులు, ఐదుగురు విద్యార్థులు, పైలట్ ఉన్నారు. ఫ్రాన్స్‌లోని నాన్సీ సమీపంలోని టోమ్‌బ్లైన్‌లో ఈ సంఘటన జరిగింది. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో స్కైడైవర్ల బృందాన్ని తీసుకెళ్తున్న చిన్న ప్రైవేట్ విమానం రహదారి పక్కన ఉన్న ప్రాంతంలో కూలిపోయింది. విమాన ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పోలీసులు, అత్యవసర వైద్య సేవల బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి.కాగా, ఈ ప్రమాదంలో 11 మంది మరణించినట్లు అధికారులు గుర్తించారు. మృతుల్లో ఐదుగురు స్కైడైవింగ్ శిక్షకులు, ఐదుగురు విద్యార్థులు, పైలట్ ఉన్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. సహాయక చర్యలకు ఆటంకం కలుగకుండా ఉండేందుకు ప్రమాద స్థలానికి దూరంగా ఉండాలని ప్రజలు, వాహనదారులకు పోలీసులు సూచించారు.

# జపాన్‌లో మళ్లీ భూకంపం.. రిక్టర్ స్కేలుపై 6.1 తీవ్రత



**న్యూఢిల్లీ జూన్ 28 (మహాప్రభ)**

జపాన్ లో మరోసారి భూకంపం సంభవించింది. ఆదివారం ఉదయం జపాన్‌లో మరోసారి భూమి కంపించింది. ఆ భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.1గా నమోదైంది. అమోరి ప్రిఫెక్చర్ సమీపంలో 40 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రం ఉన్నట్లు జపాన్ వాతావరణ విభాగం (జీహీూ) వెల్లడించింది. కాగా గత కొన్ని రోజులుగా పలు దేశాలను భూకంపాలు వణికిస్తున్నాయి. ఈ ప్రకృతి విపత్తు ఇటీవల వెనెజువెలా లో భారీ విధ్వంసాన్ని సృష్టించి విషాదాన్ని మిగిల్చింది.వెనిజువెలాలో భూకంపం సంభవించిన సమయంలోనే జపాన్‌లో 7.2 తీవ్రతతో భూకంపం వచ్చింది. మళ్లీ కొద్ది రోజుల వ్యవధిలో ఇలా రెండోసారి ప్రకంపనలు రావడంపై జపాన్‌లో ఆందోళన వ్యక్తమవుతోంది. రానున్న రోజుల్లో మరిన్ని ప్రకంపనలు రావొచ్చని జపాన్ వాతావరణ విభాగం హెచ్చరించింది. కాగా ప్రస్తుతం ఎలాంటి సునామీ హెచ్చరికలు జారీకాలేదు.

# వెయ్యికి చేరువైన వెనెజువెలా భూకంప మృతుల సంఖ్య..

-50 వేల మందికిపైగా గల్లంతు..!



**న్యూఢిల్లీ జూన్ 28 (మహాప్రభ)**


వెనెజువెలా ను కుదిపేసిన రెండు వరుస భూకంపాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. జూన్ 24న సెకెన్ల వ్యవధిలో 7.2, 7.5 తీవ్రతగల రెండు శక్తిమంతమైన భూకంపాలు వెనెజువెలాను కుదిపేశాయి. ఈ జంట భూకంపాల కారణంగా సంభవించిన మరణాల సంఖ్య దాదాపు వెయ్యికి చేరువైనట్లు తాజాగా అధికారులు వెల్లడించారు.అదేవిధంగా మూడు వేల మందికిపైగా గాయపడ్డారని, మరో 50 వేల మందికిపైగా ఆచూకీ తెలియకుండా పోయారని అధికారులు తెలిపారు. శిథిలాల కింద ఇంకా వందలాది మంది చిక్కుకుని ఉండొచ్చని భావిస్తున్నారు. రాజధాని కారకస్, లా గువేరా, యరాకుయ్, కారబోబో ప్రాంతాల్లో భారీ స్థాయిలో నష్టం జరిగింది. వందలాది భవనాలు కూలిపోగా, రహదారులు, వంతెనలు, ఆసుపత్రులు, విమానాశ్రయాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. విద్యుత్, సమాచార వ్యవస్థలు కూడా పలు ప్రాంతాల్లో నిలిచిపోయాయి. అమెరికా జియాలజికల్ సర్వే అంచనా ప్రకారం.. గత 125 ఏళ్లలో వెనెజువెలాలో సంభవించిన అత్యంత శక్తిమంతమైన భూకంపాలు ఇవే. కాగా తీవ్రంగా నష్టపోయిన వెనెజువెలాను ఆదుకునేందుకు ప్రపంచ దేశాలు ముందుకు వస్తున్నాయి. పలు దేశాలు సహాయక బృందాలను, వైద్య సిబ్బందిని, అత్యవసర సహాయ సామగ్రిని పంపిస్తున్నాయి. భారత సైన్యం కూడా 'ఆపరేషన్ అమిస్తాద్' పేరుతో వైద్య బృందాన్ని వెనెజువెలాకు పంపుతోంది.

# కరాచీ పేలుళ్లకు భారత్ కారణమన్న పాక్..

## తీవ్రంగా ఖండించిన ఇండియా

**న్యూఢిల్లీ జూన్ 28 (మహాప్రభ)**

తీవ్రవాదులకు స్వర్గధామంగా ఉన్న పాకిస్తాన్.. భారత్‌పై దుష్ప్రచారం చేస్తోంది. తాజాగా పాకిస్తాన్‌లోని కరాచీలో జరిగిన పేలుళ్లకు, ఇండియాకు సంబంధం ఉందని పాకిస్తాన్ ఆరోపించింది. ఈ ప్రచారాన్ని భారత్ ఖండించింది. పాకిస్తాన్ ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేసింది. కరాచీలోని సింధ్ రేంజర్ల కాంపౌండ్ లక్ష్యంగా శనివారం రాత్రి దాడి జరిగింది. ఈ ఘటనలో నలుగురు పాక్ సైనికులు మరణించారు. పాక్ సైన్యం జరిపిన ఎదురు కాల్పుల్లో ఆరుగురు ఉగ్రవాదులు మరణించారు.అయితే, ఈ ఘటనకు భారత్‌కు సంబంధం ఉందని పాకిస్తాన్ ఆరోపించింది. ఈ ఆరోపణలపై భారత విదేశీ వ్యవహారాల శాఖ





ఘాటుగా స్పందించింది. ఈ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ దీనిపై ఒక ప్రకటన విడుదల చేశారు. "కరాచీ దాడులకు సంబంధించి భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్తాన్ చేసిన ఆరోపణలు నిరాధారమైనవి. ఈ ఆరోపణల్ని భారత్ ఖండిస్తోంది. ఇతరుల్ని వేలెత్తి చూపే ముందు పాకిస్తాన్ తన దేశంలోని ఉగ్రవాదులపై దృష్టి సారించాలి. స్వదేశంలో ఉన్న ఉగ్రస్థావరాలపై పాక్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. ఉగ్రవాదంపై ఆధారపడే విధానాన్ని పాక్ విడిచిపెట్టాలి" అంటూ ప్రకటన విడుదల చేసింది. తమ దేశంలోని భద్రతా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే పాక్ ఇలాంటి ఆరోపణలు చేస్తోందని విమర్శించింది. దీని ద్వారా పాకిస్తాన్ ఉగ్రవాదులకు నిలయంగా మారిందని, అక్కడే ఉగ్ర స్థావరాలున్నాయని భారత్ పరోక్షంగా స్పష్టం చేసింది. కరాచీ పేలుళ్ల అంశంలో ఇండియాపై పాక్ ఆరోపణలు చేస్తే.. ఈ దాడికి తామే బాధ్యులమని జమాత్-ఉల్-అహ్రార్ సంస్థ ప్రకటించుకుంది. ఇది నిషేధిత తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) అనే పాక్ ఉగ్రసంస్థ నుంచి విడిపోయిన సంస్థ. గతంలో కూడా ఈ సంస్త పాక్‌లోని ప్రభుత్వ కార్యాలయాలు, సైనికులు లక్ష్యంగా దాడి చేసింది. 202౪4 తొలిసారిగా కరాచీలో చైనా ఇంజినీర్లపై ఈ సంస్థ ఉగ్రదాడి చేసింది. ఈ ఘటనలో ఇద్దరు చైనీయులు మరణించారు.

# పెళ్లికి నిరాకరించిన యువతి..

## ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటికి నిప్పు..
## యువతికి తీవ్ర గాయాలు

**న్యూఢిల్లీ జూన్ 28 (మహాప్రభ)**

ఒడిశాలో దారుణం జరిగింది. ఒక యువతి తనతో పెళ్లికి నిరాకరించిందని ఆగ్రహించిన ఒక యువకుడు ఆమె ఇంటిని దహనం చేసేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనలో ఇంట్లో నిద్రిస్తున్న ఆ యువతి తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లాలోని బిస్రా బ్లాక్‌కు చెందిన ఒక గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అదే ప్రాంతానికి చెందిన రజత్ కిరో అనే వ్యక్తి కొంతకాలంగా ఒక యువతిని ఇష్టపడుతున్నాడు. తనను పెళ్లి చేసుకుంటానని కూడా ఆమెకు చెప్పాడు.కానీ, ఇందుకు ఆమె నిరాకరించింది. ప్రేమ, పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో గతంలో ఆమెపై దాడి కూడా చేశాడు. ఇలా అనేకసార్లు తన ప్రేమ విషయం



చెప్పినా ఒప్పుకోకపోవడంతో ఆమెను చంపాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారం రాత్రి ఆమె తన ఇంట్లో నిద్రిస్తుండగా ఇంట్లోకి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో మంటలు వ్యాపించడంతో ఇంట్లో నుంచి ఆ యువతి అరిచింది. అలాగే, ఆ ఇంటికి పక్కనే ఉన్న యువతి బంధువులు కూడా వెంటనే స్పందించారు. అప్పటికే ఇల్లు చాలా వరకు కాలిపోయింది. ఇంకా మంటలు ఎగసిపడుతున్నాయి. వెంటనే ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు స్పందించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఎలాగోలా శ్రమించి, ఆమెను ఇంట్లోంచి బయటకు తీసుకొచ్చారు. అప్పటికే ఆమెకు తీవ్రంగా కాలిన గాయాలయ్యాయి. వెంటనే ఆమెను రూర్కేలాలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆమెకు 40 శాతం కాలిన గాయాలయ్యాయని, ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మరోవైపు ఈ ఘటనపై యువతి కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధిత యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నిందితుడిని రజత్ కిరోగా గుర్తించారు. అతడిని ఇప్పటికే అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఘటనా స్థలానికి పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు వెళ్లి ఆధారాలు సేకరించారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చేస్తామని పోలీసులు తెలిపారు. కేసు తదుపరి విచారణ కొనసాగుతోంది.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న శ్రీలంక మాజీ ఆల్‌రౌండర్ తిలకరత్నే దిల్షాన్!

**న్యూఢిల్లీ జూన్ 28 (మహాప్రభ)**

శ్రీలంక క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, దిగ్గజ ఆల్‌రౌండర్ తిలకరత్నే దిల్షాన్ కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్న TG20 లీగ్‌లో 'ఖమ్మం ఏసెస్' జట్టుకు మెంటార్‌గా వ్యవహరిస్తున్న ఆయన, హైదరాబాద్ షెడ్యూల్ మధ్యలో లభించిన విరామ సమయంలో తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు.దిల్షాన్ ఆదివారం ఉదయం విరామ సమయంలో తిరుమల శ్రీవారిని



దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయాన్ని గౌరవిస్తూ ఆయన ధోతి ధరించి స్వామివారి సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో ఆలయ అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం పలకగా, తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపలికి వచ్చిన తిలకరత్నే దిల్షాన్‌ను చూసేందుకు భక్తులు, క్రికెట్ అభిమానులు ఎగబడ్డారు. ఆయనతో సెల్ఫీల కోసం పోటీ పడగా, దిల్షాన్ కూడా ఎంతో ఓపికగా నవ్వుతూ అభిమానులకు అభివాదం చేస్తూ సెల్ఫీలు ఇచ్చారు.

### బంగారం కొనుగోళ్లు తగ్గించినందుకు
# ధన్యవాదాలు

మొదటి తరువాయి

తాను చేసిన పలు సూచనలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని చెప్పారు. తన పిలుపులకు కేవలం మద్దతు ఇవ్వడమే కాకుండా, వాటిని ఆచరణలో పెట్టడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తాను ప్రజలను బంగారం కొనుగోళ్లు తగ్గించాలని, ఇంధన వినియోగాన్ని నియంత్రించాలని చేసిన విజ్ఞప్తులకు దేశ ప్రజలు సానుకూలంగా స్పందించారని చెప్పారు. కార్‌పూలింగ్, ఇంధన పొదుపు, విదేశీ ప్రయాణాల తగ్గింపు వంటి చర్యలు దేశ ఆర్థిక వ్యవస్థకు, పర్యావరణానికి మేలు చేస్తున్నాయన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ఇచ్చిన సూచనలకు ప్రజలు సహకరించడం దేశ ఐక్యతకు నిదర్శనమని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతోనే దేశం ఇలాంటి సంక్షోభ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనగలదని ప్రధాని మోడీ అన్నారు. దేశ భద్రత స్వయం సమృద్ధి దిశగా భారత్ వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు.

2026 తొలి ఆరు నెలలు ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో... ఈ కాలంలో భారత్ అనేక రంగాల్లో గొప్ప విజయాలు సాధించిందని గుర్తు చేశారు. ముఖ్యంగా రక్షణ రంగంలో వచ్చిన పురోగతి దేశ ప్రజలందరికీ గర్వకారణమని ఆయన వివరించారు. స్వదేశీ ఉత్పత్తులు, ఆధునిక సాంకేతికత, బలమైన రక్షణ వ్యవస్థలతో భారత్ త్వరితగతిన ఆత్మనిర్భరత వైపు దూసుకుపోతోందని స్పష్టం చేశారు. ఇక ఇటీవల జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవం గురించి కూడా ప్రధాని ప్రస్తావించారు. ప్రపంచవ్యాప్తంగా 2,500కు పైగా ప్రదేశాల్లో వివిధ యోగా కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. నలంద విశ్వవిద్యాలయం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలను ప్రధాని ప్రశంసించారు.

## పాకిస్థాన్ సైన్యంపై ఉగ్రదాడి..


**-నలుగురు జవాన్‌లు మృతి..**
**-సైన్యం దాడిలో ఆరుగురు ఉగ్రవాదులు హతం..!**
**-కరాచీలోని సింధ్ రేంజర్ల స్థావరంపై భీకర ఉగ్రదాడి**
**- పేలుడు పదార్థాల వాహనంతో దాడికి పాల్పడిన ఉగ్రవాదులు**
**- దాడికి బాధ్యత వహించిన జమాత్-ఉల్-అహ్రార్ ఉగ్రసంస్థ**



న్యూఢిల్లీ,
పాకిస్థాన్‌లోని కరాచీ నగరంలో భీకర ఉగ్రదాడి జరిగింది. నగరంలోని సింధ్ రేంజర్ల స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడి, కాల్పుల ఘటనలో నలుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతమవగా, మరొకరిని సజీవంగా పట్టుకున్నారు. కరాచీలోని గులిస్తాన్ ఎజాహర్ ప్రాంతంలో ఉన్న సింధ్ రేంజర్ల ప్రధాన కార్యాలయంపై ఉగ్రవాదులు పేలుడు పదార్థాలతో నిండిన వాహనంతో దూసుకొచ్చారు. స్థావరాన్ని ఢీకొట్టి వాహనాన్ని పేల్చేవేసిన వెంటనే, మిగిలిన ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. అప్రమత్తమైన భద్రతా బలగాలు వెంటనే ఎదురుదాడికి దిగడంతో ఆ ప్రాంతం మొత్తం కాల్పుల మోతతో దద్దరిల్లింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రత్యేక పోలీసు బలగాలు, కమాండోలను రంగంలోకి దించారు. ఈ దాడికి తామే బాధ్యులమని తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపి) నుంచి విడిపోయిన 'జమాత్-ఉల్-అహ్రార్' అనే ఉగ్రవాద సంస్థ ప్రకటించుకుంది. పాకిస్థాన్‌లో భద్రతా బలగాలపై ఇటీవలి కాలంలో దాడులు పెరిగిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దాడిపై సింధ్ ముఖ్యమంత్రి సయ్యద్ మురాద్ అలీ షా తీవ్రంగా స్పందించారు. ఘటనపై సమగ్ర విచారణ జరపాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రస్తుతం భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని, కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ ఘటనలో సామాన్య పౌరులెవరూ గాయపడలేదని అధికారులు ప్రాథమికంగా తెలిపారు.

# మళ్లీ యుద్ధమేఘాలు!

- నౌకలపై ఇరాన్ దాడికి అమెరికా ప్రతిదాడులు
- ప్రతీకారంగా కువైట్, బహ్రెయిన్‌లపై ఐఆర్‌జీసీ ఎటాక్
- ఇరాన్ ఆనవాళ్లు కూడా ఉండవని ట్రంప్ వార్నింగ్



✓, నేషనల్ బ్యూరో:
పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఇటీవల తాత్కాలిక కాల్పుల ఒప్పందం జరిగినప్పటికీ.. మళ్లీ పరిస్థితులు మొదటికే వచ్చేలా కనిపిస్తున్నాయి. ఇరాన్ ఓ నౌకపై దాడి చేసి కాల్పుల విరమణను ఉల్లంఘించిందని ఆరోపిస్తూ అమెరికా భీకర దాడులు చేసింది. దీనికి ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కూడా గట్టిగానే బదులు ఇచ్చింది. కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో దాడులకు దిగింది. అమెరికా ఇంకా తన దాడులను కొనసాగిస్తే యుద్ధాన్ని ముగించడానికి జరుగుతున్న చర్చలు పూర్తిగా నిలిచిపోతాయి అని ఇరాన్ హెచ్చరించింది.

**చమురు ట్యాంకర్ పై దాడి చేసినందుకే..**
ఖతార్ నుంచి బయలుదేరి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నౌకాశ్రయానికి హోర్ముజ్ జలసంధి గుండా వెళ్తున్న ఓ అంతర్జాతీయ నౌకపై గత శనివారం తెల్లవారుజామున ఇరాన్ డ్రోన్లతో దాడి చేసింది. ఈ దాడితో ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ట్రంప్ ఆగ్రహించగా.. అమెరికా ప్రతిగా దక్షిణ ఇరాన్‌లోని సిరిక్ ప్రాంతంలో దాడులకు దిగింది. ఇందులో సిరిక్, బందర్-ఏ లెంఘూ. కేశ్ ఐలాండ్‌లోని ఇరాన్ స్థావరాలపై అమెరికా యుద్ధ విమానాలు బాంబుల వర్షం కురిపించాయి. అలాగే కేశ్ దీవుల్లో ఉన్న ఇరాన్ నిఘా వ్యవస్థలు, క్షిపణి, డ్రోన్ నిల్వ కేంద్రాలు, కోస్టల్ రాడార్ సైట్లపై దాడులు చేసింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని గౌరవించే అవకాశం ఇరాన్‌కు లభించిందని, కానీ కీడు నౌకపై దాడి చేసి ఆ దేశం దానిని వదులుకుందని అమెరికా సైన్యం తెలిపింది.

**ఇరాన్ ఎదురుదాడులు..**
అమెరికా చేసిన దాడులకు ప్రతీకారంగా ఐఆర్‌జీసీ ఎదురుదాడులకు దిగింది. బహ్రెయిన్, కువైట్‌లో ఉన్న అమెరికా స్థావరాలపై దాడులు చేసింది. బహ్రెయిన్‌లోని అమెరికా నేవీకి చెందిన 5వ ఫ్లీట్ బేస్‌ను టార్గెట్ చేసుకొని క్షిపణి దాడి చేసింది. దీంతో ఆ దేశవ్యాప్తంగా సైరన్లు మోగాయి. ఓ క్షిపణి రాజధాని మనామాలోని ఒక నివాస భవనాన్ని తాకడంతో కొంత ధ్వంసం అయ్యింది. అలాగే కువైట్‌లోని అమెరికా మెయిన్ ఆర్మీ బేస్ అయిన అలీ అల్-సలేంపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. అయితే కువైట్ ఎయిర్ డిఫెన్స్ వాటిని గాలిలోనే పేల్చేశాయి.

**ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్**
ఇరాన్ దాడులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ పదే పదే ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. ఇక తాము శాంతియుతంగా ఉండలేమని అసహనం వ్యక్తం చేశారు. తాము సైనిక పరంగా మొదలుపెట్టిన పనిని పూర్తి చేయాల్సి వస్తుందని అన్నారు. అదే జరిగితే ఇక ఇరాన్ ఉనికే ఉండదని, దాని ఆనవాళ్లు భూమిపై కనిపించవని సీరియస్‌గా హెచ్చరించారు.

# కూన కుమ్మేసింది

**-రెండో టీ20లో 1 పరుగు తేడాతో గెలుపు**
**-2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన ఐర్లాండ్**
**-తిలక్ వర్మ అర్ధశతకం వృథా..**
**-టీ20ల్లో తొలిసారి భారత్‌పై సిరీస్ విజయం**

**ఐర్లాండ్ చరిత్ర సృష్టించగా, ప్రపంచ చాంపియన్‌కు దారుణ భంగపాటు. పేస్, బౌన్స్‌కు అనుకూలించిన పిచ్‌పై వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైన టీమ్ ఇండియా టీ20 సిరీస్‌ను 0-2తో ఐర్లాండ్‌కు కోల్పోయింది. దీంతో పొట్టి ఫార్మాట్‌లో వరుసగా 12 సిరీస్ విజయాలు సాధించిన భారత్ జైత్రయాత్రకు పసికూన ఐర్లాండ్ బ్రేక్ వేసింది. ఐర్లాండ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 154 పరుగులు చేయగా, హ్యారీ టెక్టర్ (53) అర్ధ సెంచరీతో రాణించాడు. ఛేదనలో తిలక్ వర్మ (55) అర్ధ సెంచరీతో పోరాడినా భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 153 పరుగులే చేసింది. ఒక్క పరుగు తేడాతో ఐర్లాండ్ చేతిలో భారత్ ఓటమి పాలైంది. ఐర్లాండ్ చేతిలో భారత్‌కు ఇది తొలి సిరీస్ ఓటమి.**

బెల్‌ఫాస్ట్
ఐర్లాండ్ అద్భుతం చేసింది. టీ20 ప్రపంచ చాంపియన్ టీమ్ ఇండియాపై చారిత్రక సిరీస్ విజయం సాధించింది. మూడు రోజుల వ్యవధిలో భారత్‌పై రెండు సార్లు విజయం సాధించిన ఐర్లాండ్ 2-0తో టీ20 సిరీస్‌ను ఏకంగా క్లీన్‌స్వీప్ చేసింది.



ఐర్లాండ్ క్రికెట్ చరిత్రలోనే ఆ జట్టుకు ఇదే అతిపెద్ద విజయం. ఆదివారం బెల్‌ఫాస్ట్‌లో జరిగిన రెండో టీ20లో ఆతిథ్య ఐర్లాండ్ 1 పరుగుల తేడాతో గెలుపొందింది. 155 పరుగుల ఛేదనలో భారత్ చతికిల పడింది. వైస్ కెప్టెన్ తిలక్ వర్మ (55, 46 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో పోరాడిన ఫలితం లేకపోయింది. ఓపెనర్లు సంజు శాంసన్ (0), అభిషేక్ శర్మ (0) సున్నా పరుగులకే అవుటవగా.. ఇషాన్ కిషన్ (12), శ్రేయస్ అయ్యర్ (10) బాధ్యతగా ఆడటంలో విఫలం అయ్యారు. తిలక్ వర్మ ఓ ఎండ్‌లో నిలబడినా.. అక్షర్ పటేల్ (14), శివం దూబె (20), సూర్యాన్ష్ షెడ్జె (1) ఆశించిన సహకారం అందించలేదు. ఆఖర్లో హర్షిత్ రానా (21), ప్రిన్స్ యాదవ్ (6 నాటౌట్) పోరాడినా భారత్‌కు భంగపాటు తప్పలేదు. పవర్‌ప్లే, మిడిల్ ఓవర్లలో భారత్‌పై పైచేయి సాధించిన ఐర్లాండ్.. అద్వితీయ విజయంతో స్వదేశంలో క్రికెట్ అభిమానుల సంబురాలకు తెరతీసింది.

**రాణించిన టెక్టర్**
వర్షం అంతరాయం కలిగించిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానాలు ఓపెనర్లను అవుట్ చేసి బ్రేక్ అందించినా.. ఆతిథ్య ఐర్లాండ్ పవర్‌ప్లేలో 44 పరుగులు చేసింది. టిమ్ టెక్టర్ (5), రాస్ అడైర్ (16)లు ఎదురుదాడికి ప్రయత్నించినా వికెట్లు నిలుపుకోలేదు. హ్యారీ టెక్టర్ (53), కెప్టెన్ లోర్కాన్ టకర్ (15)తో కలిసి 27 పరుగులు జోడించాడు. టకర్‌ను ప్రిన్స్ యాదవ్ సాగనంపినా.. బెన్ కాలిట్జ్ (37) జతగా టెక్టర్ జోరందుకున్నాడు. ఈ ఇద్దరూ నాల్గో వికెట్‌కు 44 బంతుల్లోనే 65 పరుగులు చేశారు. వర్షంతో ఇన్నింగ్స్‌కు అంతరాయం కలిగినా.. టెక్టర్ జోరు తగ్గలేదు. ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 44 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన టెక్టర్.. బౌలింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై ఐర్లాండ్‌కు మంచి స్కోరు అందించాడు. ఆఖర్లో జార్జ్ డాక్‌రెల్ (19) సైతం రాణించాడు. దీంతో 20 ఓవర్లలో 8 వికెట్లకు ఐర్లాండ్ 154 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అరంగేట్ర పేసర్ ప్రిన్స్ యాదవ్ (3/22), శిం దూబె (2/25), అర్ష్‌దీప్ సింగ్ (2/35) రాణించారు.

# అన్నదాతలకు అండగా 'ప్రజా ప్రభుత్వం'

మొదటి తరువాయి

**వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో పైసలు**
అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో భారీ వర్షాల సూచనలు ఉన్నప్పటికీ, ఏ విపత్తు ఎదురైనా ఈ సభ అనుకున్న దానికంటే డబుల్, త్రిబుల్ సక్సెస్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. గత రెండున్నరేళ్లుగా ఈ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటను అక్షరాలా నిలబెట్టుకుంటూ రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో క్యాబినెట్ సాహసోపేత నిర్ణయం తీసుకుని, వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం మానవీయ కోణంలో కొనుగోలు చేసినదని గుర్తుచేశారు. కేవలం కొద్దిరోజుల కొద్దిగా, కొన్న వారం రోజుల లోపులే రైతుల అకౌంట్లో పైసలు వేసిన నిఖార్సైన రైతు పక్షపాత ప్రభుత్వం ఇది అని కొనియాడారు.

**రైతు ద్రోహులే నేడు కపట ప్రేమకు ముసుగు!**
గత పదేళ్ల పాలకుల తీరుపై మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. కేంద్ర, రాష్ట్రాల్లో గతంలో అధికారంలో ఉన్నవాళ్లు నేడు ఈ ప్రభుత్వంపై అనవసరంగా అలవాటు, చవకలు వేతుతున్నారని మండిపడ్డారు. ప్రజలు తమ వైపు చూడటం లేదని క్షేత్రస్థాయిలోనే వాళ్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. "ఇదే ఖమ్మం పట్టణంలో గతంలో వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు, రైతుల కష్టాలు పట్టించుకోకుండా, నడిరోడ్డుపై అన్నదాతలకు సంకెళ్లు వేసి జైలుకు పంపించిన దుర్మార్గాన్ని ఈ జిల్లా ప్రజలు ఎప్పటికీ మరవరు. నాటు రైతులను ఎప్పటికి, హింసించిన వాళ్లే.. నేడు ముసలి కన్నీరు కారుస్తూ కపట ప్రేమ ఒలకపోస్తున్నారు. ఈ రాజకీయ డ్రామాలను రైతులందరూ గమనిస్తూనే ఉన్నారు" అని హెచ్చరించారు. జిల్లా సీనియర్ నేత, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యేలందరినీ కలుపుకుని ఈ సభను ఒక చారిత్రాత్మక విజయంగా మలుస్తామన్నారు.

# ఎస్ఎల్ బీసీ- డిండి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం

మొదటి తరువాయి

తర్వాత నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన 'ప్రజాపాలన--ప్రగతిపాలన' బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. మూసీ నది ప్రక్షాళనను తన జీవిత లక్ష్యంగా తీసుకొని అమలు చేస్తున్నానని తెలిపారు. తెలంగాణ భవిష్యత్‌కు అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణంలో ప్రభుత్వం వెనుకడుగు వేయదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో నల్లగొండ జిల్లా త్యాగాలు చిరస్మరణీయమని తెలిపారు. తొలి ఉద్యమంలో మంత్రి పదవిని త్యజించిన కొండా లక్ష్మణ్ బాపూజీ, మలి ఉద్యమంలో మంత్రి పదవికి రాజీనామా చేసి ఆమరణ నిరాహార దీక్ష చేసిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి సేవలను కొనియాడారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి, కానిస్టేబుల్ కిష్టయ్య, యాదయ్య తదితర అమరవీరులను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు సిద్ధం
కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఎప్పుడైనా ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమని సీఎం ప్రకటించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలన, బీజేపీ కేంద్ర పాలన, కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలన, ఎన్నికల హామీల అమలుపై బహిరంగ చర్చకు రావాలని బీఆర్ఎస్, బీజేపీకి సవాల్ విసిరారు. గత ప్రభుత్వాలు ఇవ్వని లక్షలాది కొత్త రేషన్ కార్డులను తమ ప్రభుత్వం జారీ చేసిందని తెలిపారు. సంవత్సరానికి రూ.16 వేల కోట్ల వ్యయంతో 3.28 కోట్ల మంది పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడే సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టామని, ఒక్కో లబ్ధిదారునికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలు పేద కుటుంబాలకు మేలు చేస్తున్నాయని అన్నారు. ఉద్యమం పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్.. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించారు. రూ.69 వేల కోట్ల అప్పుతో ఉన్న రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పుల్లోకి నెట్టారన్నారు. కట్టిన మూడు సంవత్సరాల్లోనే కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతినడం గత ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఉద్యమ త్యాగాల పేరుతో కుటుంబ పాలనకు శ్రీకారం చుట్టి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు, అందుకే ప్రజలు వారిని తిరస్కరించి కాంగ్రెస్‌కు పట్టం కట్టారని తెలిపారు.

రైతుల కోసం రూ.1.56 లక్షల కోట్లు
రైతు రుణమాఫీ, రైతు భరోసా, పెట్టుబడి సాయం, బోనస్, వరి కొనుగోళ్లతో రైతులకు అండగా నిలిచామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 30 నెలల్లో రైతుల కోసం రూ.1.56 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశామని చెప్పారు. దేశంలో అత్యధిక వరి ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలవగా, అందులో నల్లగొండ జిల్లా మొదటి స్థానంలో ఉందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన విద్యతో పాటు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ గురుకులాలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని అన్నారు. ?

## ప్రజా సంక్షేమమే మా ఎజెండా..

మొదటి తరువాయి

పక్కా రోడ్లకు భూమిపూజ కార్యక్రమం జరగగా, తెలంగాణ రాష్ట్రంలో సెంట్రల్ రోడ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) నిధులు రూ. 13,000 కోట్లు, ఇతర ప్లాన్ బడ్జెట్లతో రూ. 10,000 కోట్లు ఇలా ఇతర మంజూరులను కలుపుకుని దాదాపు రూ. 23,000 కోట్లతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రహదారుల నిర్మాణ కార్యక్రమాన్ని ఒక పండుగలా మొదలుపెట్టారని కొనియాడారు. ఈ రూ. 23 వేల కోట్లతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాల ద్వారా మొత్తంగా దాదాపు రూ. 90,000 కోట్లతో రాష్ట్రంలో రహదారుల నిర్మాణానిపై దృష్టి సారించడం, ఇన్ఫ్రాస్ట్రక్చర్ను పెద్దఎత్తున అభివృద్ధి చేసే కార్యక్రమాలకు నాంది పలకడం, ఇది తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు అద్భుతమైన పునాదులు వేసే కార్యక్రమని అభివర్ణించారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛలైన ఎస్ఎల్బీసీ, డిండి, నక్కలగండి ప్రాజెక్టులను దశాబ్ద కాలం పాటు పరిపాలించిన ఆ ప్రభుత్వం పూర్తిగా గాలికీ వదిలేసిందని విమర్శించారు. ప్రస్తుత ఇరిగేషన్ శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిని కలిసి, 'ఈ ప్రాంతం తీవ్రంగా వెనుకబడి ఉంది, ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న ఎస్ఎల్బీసీ, డిండి ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిన ఆవశ్యకత ఉంది' అని వివరించారు. దానికి స్పందించిన ముఖ్యమంత్రి ప్రత్యేక హెలికాప్టర్లో ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. 'ఎన్ని వేల కోట్ల రూపాయలు అవసరమైనా, మన ప్రభుత్వం పూర్తిచేయలోపు ఎస్ఎల్బీసీ, డిండి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. నిధుల సమస్య లేదు, పనులు వేగంగా చేపట్టండి' అని ఆదేశాలను ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి వడివడిగా ముందుకు తీసుకెళ్తున్నారని వివరించారు. "అనాటి ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి ఉన్న తేడా ఒక్కటే. ఆ ప్రభుత్వం అధికార అహంకారంతో ప్రజలను హింసించింది. కానీ, ఈరోజు మన ప్రభుత్వం మానవీయ కోణంతో ప్రజల అవసరాలను తీర్చే కార్యక్రమాలను చేపడుతోంది" అని వివరించారు. "ఈ ప్రాంత ప్రజలకు సాగు, తాగు నీరు అందించే ప్రాజెక్టులతో పాటు, పేద, మధ్యతరగతి మహిళల కోసం పెద్దఎత్తున వడ్డీలేని రుణాలను అందిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ఏటా రూ. 20 వేల కోట్లు పైగా, రాబోయే ఐదేళ్లలో రూ. లక్ష కోట్లు పైగా మహిళలకు వడ్డీలేని రుణాలు ఇప్పించే బాధ్యతను ఈ ఇందిరమ్మ ప్రభుత్వం తీసుకుందని" తెలిపారు. "సొంతింటి కల నెరవేర్చుకోలేక ఇబ్బంది పడుతున్న ప్రతి పేద, గూడులేని కుటుంబానికి ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నాం. రాష్ట్రంలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం కోసం దాదాపు రూ. 22,500 కోట్లు కేటాయించి పేదలకు ఇళ్లు కట్టించే కార్యక్రమాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్తున్నాం. రాష్ట్రంలో మొత్తం కోటి 15 లక్షల కుటుంబాలు ఉంటే, అందులో కోటి 6 లక్షల రేషన్ కార్డుదారులకు ఒక్కొక్కరికి 6 కేజీల చొప్పున సన్న బియ్యం అందిస్తున్నాం. ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబం నాణ్యమైన బియ్యం తినాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. అలాగే, సుమారు 53 లక్షల పేద, మధ్యతరగతి కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం.

## పల్స్‌పోలియో విజయవంతం

మొదటి తరువాయి

విజయవంతంగా సాగిందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పల్స్ పోలియో కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించామని కమిషనర్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా 99 శాతం కవరేజ్‌తో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవగా, భద్రాద్రి కొత్తగూడెం 98.9 శాతం, మెదక్ 98.6 శాతం, ములుగు, వనపర్తి జిల్లాలు 98.2 శాతం, జయశంకర్ భూపాలపల్లి 98.1 శాతం కవరేజ్ సాధించాయి. హైదరాబాద్ జిల్లాలో 93.1 శాతం పూర్తయింది. ఆదివారం నాడు పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులను గుర్తించి సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యశాఖ బృందాలు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచనల మేరకు ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఐదేండ్లలోపు ప్రతి చిన్నారికి కూడా తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లి దండ్రులకు కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.

## బంగ్లాదేశ్‌కు తప్పకుండా తిరిగి వెళ్తా

మొదటి తరువాయి

కూడా షేక్ హసీనా స్పందించారు. ఆ తీర్పు రాజకీయ ప్రేరేపితం, అప్రజాస్వామికం, రాజ్యాంగ వ్యతిరేకం అని ఆమె అన్నారు. బంగ్లాదేశ్ న్యాయవ్యవస్థ రాజకీయ వేధింపులు, ప్రతీకార చర్యలకు కేంద్ర బిందువుగా మారిందని హసీనా ఆవేదన వ్యక్తం చేశారు. తన పార్టీ అయిన అవామీ లీగ్ నేతలపై ప్రతీకార చర్యలు తీసుకుంటూ, నాయకుల్ని లేకుండా చేస్తున్నారని విమర్శించారు. చావుకు తాను భయపడనన్నారు. 1975లోనే తన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల్ని కోల్పోయానన్నారు. ఆ తర్వాత తనపై కూడా గ్రెనేడ్ దాడి జరిగిందన్నారు. తనపై ఎన్నో కుట్రలు జరిగాయని, వాటన్నింటినీ దాటుకుని బంగ్లాదేశ్ ప్రజల కోసం నిలబడ్డానని చెప్పారు. ఐదుసార్లు దేశ ప్రజలు తనను ప్రధానిగా ఎన్నుకున్నారని గుర్తు చేశారు. తన జీవితం మొత్తాన్ని బంగ్లాదేశ్ కోసం, అవామీ లీగ్ కోసం ధారపోశానని చెప్పుకొచ్చారు. తనకు ఎదురయ్యే ఇబ్బందులు అన్నింటినీ దాటుకుని బంగ్లాదేశ్ వెళ్తానని షేక్ హసీనా స్పష్టం చేశారు. తన పార్టీ అవామీ లీగ్ ఒక బలమైన రాజకీయ శక్తి అని, త్వరలోనే తిరిగి పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో తిరుగుబాటు సందర్భంగా అప్పటి ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి ఇండియా చేరుకున్నారు. రెండేళ్లకుపైగా ఆమె ఇక్కడే ఆశ్రయం పొందుతున్నారు. ఇదే సమయంలో హసీనాను అక్కడి పాలకులు, కోర్టులు దేశం నుంచి బహిష్కరించాయి. ఆమెకు మరణశిక్ష కూడా విధించాయి.

## సంపాదకీయం

# రామా హరీ..!




కాశీకి పోయాను రామాహరి గంగ తీర్థమే తెచ్చాను రామాహరి! కాశీకి పోలేదు రామా హరి, ఊరి కాల్వలో నీళ్లండి రామాహరి!" 1959లో పింగళి గారు రాసిన పాట ఇది, ఘంటసాల గారు పాడారు సినిమాకోసం. ఇప్పుడయితే "రామ మందిరంలో రామాహరి/కోట్ల సొమ్ములే దోచారు రామాహరీ! ఎవరు వాళ్లంతా రామా హరీ/ నకిలీ రామ భక్తులంత రామహరీ!" అనిపాడుకోవాలేమో! మనం పాడుకోవటంకాదు, ఇప్పటికే ఓ సాధు పుంగవుడు బల్లగుద్ది మరీ మొఖం మీదే చెప్పేశాడు. బీజేపీ–ఆరెస్సెస్ వాళ్లు నకిలీ హిందువులు. గోవులను మాతా అంటూనే వధించేందుకు అనుమతినిస్తున్నారు. రాముని పేరు చెప్పి అవినీతికి పాల్పడుతున్నారు అని చెప్పేశారు. ఇప్పుడు హరిగోవింద గోవింద! డబ్బు గోవింద గోవింద! స్వర్ణం గోవింద గోవింద! వెండిగోవింద గోవింద! అని పాడుకోవాలి భక్తులు. రాముణ్ణి కొలవటం, పూజించటం, ఆరెస్సెస్, బీజేపీ పుట్టక ముందు నుండే, ప్రజలు విశ్వాసంతో చేస్తూ ఉన్నారు. వాళ్ల కంటే ముందే దేశంలో రామ మందిరాలు, రామభజనలూ ఉన్నాయి. ఊరు ప్రజలు తమ ఆధ్యాత్మికతను చాటుకోవటం ఇప్పటిది కాదు, పూర్వం నుంచీ ఉంది, కానీ గుడి పేరు చెప్పి, రాముడి పేరు చెప్పి వేలాది కోట్లు పోగేసి స్వాహా చేయటం మాత్రం ఇపుడు ఆరెస్సెస్, బీజేపీ అధికారం చేపట్టిన తర్వాతనే చూస్తున్నాము. రాజకీయాలలోకి రామున్ని లాగటం ఇప్పుడే చూస్తున్నాం. ఇప్పుడంతా అధికారం, ధనం మీద అనురక్తి తప్ప భక్తికి తావేలేదు. ద్వేషమే తప్ప ప్రేమ లేనేలేదు. పగ తప్ప కరుణలేదు. ఈ పరిణామాలు అర్థంచేసుకుని విశ్లేషించుకోవాలి. రాముని పేరు చెప్పి అధికారం చేపట్టిన వాళ్లు ఆఖరికి ఆయనకే శఠగోపం పెట్టేశారు. వేల కోట్ల రూపాయలు భక్తులమని చెప్పుకునే వాళ్లే మింగేశారు. ప్రశ్నించేవాళ్లని దేశ ద్రోహులని పిలుస్తున్నారు. రాముని వ్యతిరేకులుగా ముద్ర వేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన అత్యంత ఆర్భాటంగా అయోధ్య రామ మందిర శంకుస్థాపన గావించారు. ఆ తర్వాత రామమందిర తీర్థ క్షేత్ర ట్రస్టు పేరుతో ఆలయ నిర్మాణానికి ప్రపంచ వ్యాపితంగా, దేశంలోనూ విరాళాలు సేకరించారు. వేలకోట్ల రూపాయలను సమీకరించారు. దాదాపు 3500 కోట్లు సేకరించారని అంటున్నారు. అందులో 1800 కోట్లతో గుడి నిర్మాణం చేశారు. ఇక హుండీ ద్వారా రోజు ఆదాయం సమకూరుతూనే ఉంది. రామాలయ నిర్మాణానికి అవసరమైన భూమిని అప్పుడే అధిక మొత్తం వెచ్చించి, అంటే ఉన్న ధరకంటే చాలా ఎక్కువ చెల్లించి కొనుగోలు చేశారు. ఆనాడే ఈ అవినీతిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. కానీ భక్తిని నింపి దాన్ని కప్పేశారు. ఇపుడు ట్రస్టు పేరుతో మందిర విరాళాలను స్వాహా చేశారు. ఏడున్నర కోట్ల నుండి 200 కోట్ల స్కాం జరిగినట్లు తెలుస్తున్నది. ఇంకా విశ్లేషకులు ఈ స్కాం వేలకోట్లలో ఉంటుందని చెబుతున్నారు. మొదట నిధుల అవినీతి జరిగిందని పొగ రాగానే ఎవరూ స్పందించలేదు. సమాజ్ వాదీ నేత పవన్ పాండే మొదటగా ఆరోపించారు. రామజన్మ భూమి తీర్థా క్షేత్ర ట్రస్ట్ మాత్రం, విరాళాలు అవినీతి జరగలేదని కొట్టి పారేసింది. ఆ తర్వాత ప్రతిపక్ష నేతలు దర్యాప్తునకు డిమాండ్ చేయగా, చేయగా చివరికి యోగి ప్రభుత్వం 'సిట్'ను నియమించి దర్యాప్తు చేపట్టింది. ఎనిమిది మంది భక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారంతా సంఘ్ సభ్యులే. దర్యాప్తులో ఒక్కొక్కటి బయట పడుతున్నాయి. ఇప్పుడు ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్‌రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా ట్రస్ట్‌కు రాజీనామా చేశారు. ఇంకొక సభ్యుడు గోపాలరావు రాష్ట్రం విడిచి పారిపోయాడు. వీళ్లంతా వీహెచ్‌పి నేతలే. చాలా ఆలస్యంగా ఎనిమిది మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. గతంలో రామమందిరాన్ని వ్యతిరేకించిన వారే స్కాం గురించి మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి యోగి ఆరోపిస్తున్నారు తప్ప, అవినీతిపరుల గురించి ఒక్కమాట మాట్లాడటంలేదు. రామమందిరం పేరుతో వసూలు చేసిన డబ్బుకు, బంగారం, వెండికి రశీదులు లేవు. లెక్కలూ లేవు. 2021లోనే 200 వెండి ఇటుకలు విరాళంగా ఇచ్చినట్లు విశ్వహిందూ సింధి సేవా సంఘం ప్రకటించింది. కానీ అవి ఇపుడు కనపడటంలేవు. వజ్రాలు పొదిగిన హారం, బంగారం, వెండితో చేసిన చరణ పాదుకలు చేయించి ఇచ్చానని ముంబయి జబల్‌పూర్‌కు చెందిన భక్తుడు చెబుతున్నాడు. అవిపుడు కనపడటం లేదని అతనే వాపోతున్నాడు. సీసీ టీవీలకు అడ్డంగా నిలబడి దోచుకోవటాన్ని పరిశీలించారు. అవినీతి జరిగిందని రుజువులు బయట పడుతున్నాయి. ఈ డబ్బుతోనే బెంగాల్, ఇతర రాష్ట్రాల ఎన్నికలలో ఖర్చు చేశారన్న ఆరోపణలూ వినిపిస్తున్నాయి. రామాలయ నిర్మాణం మేమే చేయగలిగాం అని గొప్పలు చెప్పే మోడీజీ అవినీతిపై ఇంకా ఏమీ మాట్లాడటం లేదు. కానీ ఆరెస్సెస్ వాళ్లు మాత్రం నిస్సిగ్గుగా సోషల్ మీడియాలో "అవును అవినీతి జరిగింది. అవినీతిపరులైన జాతీయవాదులు కావాలా? అవినీతిపరులైన దేశద్రోహులు కావాలా?" అని పోస్టులు పెడుతున్నారు. దుర్మార్గాలను ప్రశ్నించేశారని వీరు దేశద్రోహులుగా ముద్ర వేస్తున్నారు. ప్రజల విశ్వాసాలను, భక్తిని కూడా తమ అధికారానికి, రాజకీయాలకు, స్వార్థానికి వాడుతున్న వీళ్లు అసలైన ప్రజాద్రోహులు.

# రామాయంపేటలో పోలియో చుక్కల కార్యక్రమం ప్రారంభం

**ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని చైర్‌పర్సన్ పిలుపు ఇచ్చారు**



**రామాయంపేట, జూన్ 28 (మహాప్రభ)**
రామాయంపేట మున్సిపాలిటీలో ఆదివారం పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజవాడ లావణ్య నాగరాజు ప్రారంభించారు.

**చైర్‌పర్సన్ వెల్లడి:** మున్సిపల్ కార్యాలయంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ రోజు వేసుకొని పిల్లలకు వచ్చే రెండు రోజుల్లో ఇంటింటికీ వెళ్లి ఆశా వర్కర్లు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు.

**కౌన్సిలర్ నాగరాజు:** కౌన్సిలర్ బెజవాడ నాగరాజు మాట్లాడుతూ పోలియో చుక్కలు పిల్లల భవిష్యత్తుకు ఎంతో అవసరమని అన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు కచ్చితంగా వేయించాలని, ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని కోరారు.

**పాల్గొన్నవారు:** ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వాట్సాప్ షార్ట్ న్యూస్:
రామాయంపేటలో పోలియో చుక్కలు ప్రారంభం
రామాయంపేట మున్సిపల్ కార్యాలయంలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని చైర్‌పర్సన్ బెజవాడ లావణ్య నాగరాజు ప్రారంభించారు. 5 ఏళ్లలోపు పిల్లలందరికీ చుక్కలు వేయించాలని పిలుపు. మిస్ అయితే 2 రోజుల్లో ఇంటి వద్దే వేస్తారని వెల్లడి. – మల్లేష్
యూట్యూబ్/టీవీ స్క్రోలింగ్:
రామాయంపేటలో పల్స్ పోలియో ప్రారంభం । చిన్నారులకు చుక్కలు వేసిన చైర్‌పర్సన్ లావణ్య నాగరాజు । 5 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరి । మిస్ అయితే 2 రోజుల్లో ఇంటి వద్దే
మల్లేష్, ఫోటో ఉంటే పంపు. చైర్‌పర్సన్ పిల్లలకు చుక్కలు వేస్తున్న ఫోటోతో న్యూస్ ఇంకా బాగుంటుంది.

## బీజేపీ శ్రేణులకు సునీల్ రావు దిశానిర్దేశం



**కరీంనగర్, జూన్ 28( మహాప్రభ )**
ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా కొత్త ఓటరు జాబితా రూపకల్పన కోసం బూత్ స్థాయి నాయకులు అప్రమత్తంగా ఉండి పూర్తి స్థాయిలో పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు పిలుపునిచ్చారు. శక్తి కేంద్రం ఇన్చార్జీలు, బూత్ అధ్యక్షులు, బీఎల్ఓ–2లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన ఓటర్లకు ఫారాలు అందజేసి, తిరిగి సేకరించి అధికారులకు చేరేలా చూడాలని సూచించారు. బోగస్ ఓట్లు, మరణించిన వారి ఓట్లు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఓట్లను తొలగించేలా సహకరించాలని స్పష్టం చేశారు. ఓటరు జాబితా సవరణ ఒక నెలపాటు కొనసాగుతుందని, సమన్వయంతో పని చేసి పర్ఫెక్ట్ జాబితా తయారీలో కీలక పాత్ర పోషించాలని ఆయన కోరారు. అనంతరం 43వ డివిజన్ కార్పొరేటర్ పొన్నం లక్ష్మి––మొండయ్య గౌడ్, బూత్ అధ్యక్షులు, బీఎల్ఓ–2లు, కార్యకర్తలతో కలిసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని వీక్షించారు.

## కొండగట్టులో వాహన పూజల సందడి



**కొండగట్టు,జూన్ 28( మహాప్రభ )**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ భారీగా నెలకొంది. తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనం కోసం చేరుకున్నారు. కొత్తగా కొనుగోలు చేసిన కార్లు, ద్విచక్ర వాహనాలు, వాణిజ్య వాహనాలతో వచ్చిన భక్తులు ప్రత్యేక వాహన పూజలు నిర్వహించారు. వాహనాలను పూలతో అలంకరించి, కొబ్బరికాయలు కొట్టి, నిమ్మకాయలు ఉంచి పూజలు చేశారు. ఆలయ పూజారి అనిల్ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య పూజలు జరిగి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు క్యూలైన్లలో క్రమశిక్షణతో స్వామివారిని దర్శించుకున్నారు. కొందరు ప్రత్యేక అర్చనలు చేయించుకోగా, మరికొందరు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పరిసరాల్లో భజనలు, గోవింద నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు తాగునీరు, క్యూలైన్లు, పార్కింగ్, భద్రత వంటి ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహన పూజలు, ప్రత్యేక అర్చనలు, దర్శనాలతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కొండగట్టు మరోసారి భక్తి విశ్వాసానికి ప్రతీకగా నిలిచింది.

## నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని పరిశీలించిన డిప్యూటీ మేయర్



**కరీంనగర్, జూన్ 28( మహాప్రభ )**
నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితమైన త్రాగునీరు అందించడమే లక్ష్యమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు. ఆదివారం ఆయన నగరపాలక సంస్థ నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని సందర్శించి ఫిల్టర్ బెడ్‌లు, మోటార్లు, ప్యానల్ బోర్డులు, బూస్టర్ పంపుల పనితీరును పరిశీలించారు. క్లోరినేషన్ విధానం, నీటి నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేసి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ప్రస్తుతం మానేరు డ్యాంలో 5.8 టీఎంసీల నీరు ఉందని, రోజుకు 45 ఎంఎల్‌డీ రా వాటర్ సేకరించి 40 ఎంఎల్‌డీ శుద్ధి చేసిన నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నీటి మట్టం తగ్గినా బూస్టర్ల ద్వారా రాబోయే ఆరు నెలల వరకు త్రాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. వర్షాకాలం ప్రారంభమవడంతో నీటి సరఫరా మరింత సులభం అవుతుందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన హామీ ఇచ్చారు.

## బస్సుల నిలుపుదలకై మహిళల రాస్తారోకో



**కరీంనగర్, జూన్ 28( మహాప్రభ )**
కొత్తపల్లి మండల కేంద్రంలో ఎక్స్‌ప్రెస్ బస్సుల నిలుపుదల కోసం స్థానిక మహిళలు ఆదివారం ఉదయం రాస్తారోకో నిర్వహించారు. జూలై 2025లో రీజినల్ మేనేజర్ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, డ్రైవర్లు, కండక్టర్లు బస్సులను ఆపడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో డివిజన్ కార్పొరేటర్ వేముల కవిత, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటలకు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. రాస్తారోకోతో రాకపోకలు స్తంభించిపోవడంతో పోలీసులు అక్కడకు చేరుకుని సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు తమ నిరసనను విరమించారు.

## పల్స్ పోలియో కార్యక్రమాలు విజయవంతం



**కల్వకుర్తి, జూన్ 28( మహాప్రభ )**
: ఐదేళ్లలోపు చిన్నారుల ఆరోగ్య రక్షణ కోసం కల్వకుర్తి పురపాలక సంఘం పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. బస్టాండ్ పాత గ్రామపంచాయతీ ఆవరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గోరేటి శ్రీనివాస్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు. ఎనిమిదవ వార్డులో అంగన్వాడీ కేంద్రంలో కౌన్సిలర్ కోడెల లలిత గణేష్ యాదవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ "నిండు జీవితానికి రెండు చుక్కలు" అని, పోలియో నిర్మూలనలో ప్రతి కుటుంబం సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ అలివేల, కాంగ్రెస్ మహిళా నాయకురాలు రిహానా బేగం, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దేవరకొండలో రూ.1.42 కోట్లతో

# సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

**-శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**



**దేవరకొండ జూన్ 28( మహా ప్రభ)**
దేవరకొండ పట్టణంలోని 11, 12 వార్డుల్లో నగరాభివృద్ధి నిధుల కింద "రూ.1 కోటి 42 లక్షల 25 వేల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు" దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు నాణ్యమైన రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.గతంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాల్లో కూడా అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. దేవరకొండ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తోందని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. రూ.1.42 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు పూర్తయిన అనంతరం ఆయా వార్డుల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలగడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రూ.13,006 కోట్లతో భారీ రోడ్ల ప్రాజెక్టు

**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బాలు నాయక్**




**దేవరకొండ జూన్ 28( మహా ప్రభ)**
రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తెలిపారు. నల్లగొండ జిల్లా కనగల్‌లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిలి"రూ.13,006 కోట్ల వ్యయంతో చేపట్టనున్న భారీ హ్యామ్ (హెచ్ ఎ ఎం) రోడ్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన" చేయడం తెలంగాణ అభివృద్ధిలో మరో చారిత్రాత్మక అడుగని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా "6,092 కిలోమీటర్ల మేర 441 రహదారుల అభివృద్ధికి శ్రీకారం" చుట్టడం వల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య రవాణా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. మెరుగైన రహదారులు నిర్మాణం వల్ల ప్రజల ప్రయాణం సౌకర్యవంతంగా మారడంతో పాటు వ్యవసాయం, వ్యాపారం, పరిశ్రమల అభివృద్ధికి కూడా ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ప్రజల సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే ఇలాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి కి దేవరకొండ నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ భారీ రహదారి ప్రాజెక్టు పూర్తయిన తర్వాత తెలంగాణలో రవాణా వ్యవస్థ మరింత ఆధునికంగా మారి ప్రజలకు వేగవంతమైన, సురక్షితమైన ప్రయాణ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే గారు ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్ర పురోగతికి బాటలు వేస్తున్నాయని పేర్కొన్నారు.

## బుక్ స్టాల్స్ నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**-బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ**



**దేవరకొండ జూన్ 28( మహాప్రభ )**
బుక్ స్టాల్స్ నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి అని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం దేవరకొండ పట్టణంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ....... ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు,యూనిఫామ్ లు,టై బెల్ట్ లు అమ్ముతూ పేద విద్యార్థులను దోచుకుంటున్నారని ఆరోపించారు.అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని ఆయన కోరారు.ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి అని ఆయన కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్వీ మండల అధ్యక్షులు పాత్లవత్ లక్ష్మణ్,జామీర్ బాబా,పేట అభి, అంజనెయులు, వెంకటేష్ , మహేష్,రవి,తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా పారదర్శకతకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

**-ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**




**దేవరకొండ జూన్ 28( మహా ప్రభ)**
చింతపల్లి మండలం కుర్మేడు ఎక్స్ రోడ్డు వద్ద ఉన్న "18వ బూత్ పరిధిలోని ఓటర్ల ఎన్యుమరేషన్ పత్రాలను" దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సంబంధిత బీఎల్ఓ కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం అమలు చేస్తున్న సర్‌విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితా పూర్తిస్థాయిలో పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేలా అధికారులు నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు తన వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని, మార్పులు లేదా సవరణలు అవసరమైతే సంబంధిత బీఎల్ఓలను సంప్రదించి పూర్తి చయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అందరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. మార్గదర్శకాలకు అనుగుణంగా స్థానిక బీఎల్ఓ మరియు సంబంధిత అధికారులకు 18వ బూత్ పరిధిలోని ఓటర్ల ఎన్యుమరేషన్ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, బిఎల్ఎ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**దేవరకొండ జూన్ 28 ( మహా ప్రభ)**
నేరేడుగొమ్ము మండలం కొత్తపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ కేతావత్ దస్రు నాయక్ కుమారుడు "రవి కుమార్ -- ఝాన్సీ వివాహ రిసెప్షన్" వేడుకల్లో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, పరస్పర అవగాహన, అనురాగాలతో ఆదర్శ దంపతులుగా నిలవాలని ఆశీర్వదించారు.
అనంతరం సర్పంచ్ కేతావత్ దస్రు నాయక్ తో పాటు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించి, వివాహ వేడుకను విజయవంతంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేరేడుగొమ్ము మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాంకునావత్ బిక్కు నాయక్, మాజీ మండల అధ్యక్షులు లోకాసాని కృష్ణయ్య, చందంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొండేటి మల్లారెడ్డి, దేవరకొండ మాజీ కౌన్సిలర్ ఏకుల కర్ణాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## కారు--బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

**ఖానాపూర్, జూన్ 28 ( మహా ప్రభ)**
ఖానాపూర్ మండలంలోని నిర్మల్--మంచిర్యాల్ రహదారిపై రాజురా చౌరస్తా వద్ద ఆదివారం కారు, బైక్ ఢీకొన్న ఘటనలో మామడ మండల తండాకు చెందిన గంగారాం (61) తీవ్రంగా గాయపడ్డాడు.ఈ ప్రమాదంలో ఆయన కాలు విరగడంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స చేసి, అనంతరం మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## పల్స్ పోలియో విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

**- చిన్నారుల ఆరోగ్య రక్షణ అందరి బాధ్యత: బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి.**






**గడ్డి అన్నారం - 28 జూన్ (మహాప్రభ)**
దిల్‌సుఖ్‌నగర్‌లోని లోటస్ లాప్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో చైర్మన్ కోమటిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి పూర్తిగా రక్షించడంలో పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత కీలకమని అన్నారు. ప్రతి తల్లిదండ్రి తమ సామాజిక బాధ్యతగా భావించి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. భారతదేశం సాధించిన పోలియో రహిత హోదాను శాశ్వతంగా కొనసాగించాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంట్లో అవగాహన పెంపొందించి ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలకు దూరం కాకుండా చూడాలని సూచించారు.విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం కోసం నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లోటస్ లాప్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ కోమటిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, డైరెక్టర్ అభిషేక్ రెడ్డిలను ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు గాంధారి మండలం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు రాక



**గాంధారి, జూన్ 28 (మహాప్రభ)**
కామారెడ్డి జిల్లా గాందారి మండలం లో వివిధ గ్రామాల్లో పర్యటన మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ ప్రారంభోత్సవానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, వస్తున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగసాని శ్రీనివాస్, ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం వివిధ కార్యక్రమలలో ఎమ్మెల్యే పాల్గొంటారని అన్నారు.

## పలువురికి దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పరామర్శ



**దేవరకొండ డివిజన్ జూన్ 28( మహాప్రభ )**
దేవరకొండ మండలం రత్య తండాకు చెందిన బిఆర్ఎస్ మండల నాయకులు వడత్య గణేష్ కుమారుడు వడత్య సిదార్థ్,పెద్ద తండాకు చెందిన రమావత్ లక్ష్మణ్ లు వేరు వేరు రోడ్డు ప్రమాదం లో గాయపడ్డారు.దేవరకొండ పట్టణంలోని సంజీవని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వడత్య సిదార్థ్ నీ,రాములు నాయక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రమావత్ లక్ష్మణ్ నీ దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....మెరుగైన వైద్యం అందించాలని ఆయన కోరారు.వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ రామావత్ నర్సింహ,చెన్నారం సర్పంచ్ రమావత్ తులసిరామ్, బొడ్డుపల్లి కృష్ణ,వడత్య బాలు,ముదిగొండ హరిదాస్,పగిడిమర్రి నాగరాజు ,రాజు, తదితరులు ఉన్నారు.

## కొత్తపేట లో పేకాట స్థావరంపై పోలీసుల దాడి ఐదుగురు అరెస్ట్..

**-రూ.22,930 నగదు, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం**



**శివ్వంపేట, జూన్ 28 (మహాప్రభ)**
శివంపేట మండలంలోని కోతాపేట గ్రామ సమీపంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శివంపేట పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడి నిర్వహించారు. నమ్మదగిన సమాచారం మేరకు చేపట్టిన ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.22,930 నగదు, ఐదు మొబైల్ ఫోన్లు, పేక ముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టైన వారిలో శివంపేటకు చెందిన లష్కరి స్వామి (41), వడ్డే ప్రభాకర్ (31), గోమారం గ్రామానికి చెందిన గడ్డం శ్రీకాంత్ రెడ్డి (38), వడ్ల హరి (26), రుస్తుంపేట సాయి (28) ఉన్నారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ మండల పరిధిలో జూదం, పేకాట వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# ముందస్తు అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం




**దేవర కొండ జూన్ 28( మహా ప్రభ** ఈరోజు నల్లగొండ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో, ప్రజాస్వామ్యబద్ధంగా తమ నిరసనను తెలియజేయడానికి సిద్ధమవుతున్న విద్యార్థి మరియు ప్రజా సంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ అన్నారు ప్రజాస్వామ్య దేశంలో తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం,నిరసన తెలపడం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని ముఖ్యమంత్రి పర్యటన సాకుతో తెల్లవారుజామునే నాయకుల ఇళ్లకు వెళ్లి, వారిని బలవంతంగా అదుపులోకి తీసుకుని దేవరకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించడం ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న నాయకుల గొంతు నొక్కడం సరికాదని,ఈ అక్రమ అరెస్టులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.

## పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్






**కొత్తపేట -28 జూన్ (మహాప్రభ)** కొత్తపేట డివిజన్ పరిధిలోని ప్రజయ్ నివాస్ ఫేస్-1 లో ఉన్న బస్తీ దవాఖానలో నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ, పోలియో రహిత భారతదేశం నిర్మాణంలో ప్రతి తల్లిదండ్రి భాగస్వామి కావాలి. ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ద్వారా వారి భవిష్యత్తును సురక్షితంగా కాపాడవచ్చు. ఒక్క చిన్నారి కూడా ఈ కార్యక్రమానికి దూరం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ప్రభుత్వ ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు.

అలాగే ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మరియు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజయ్ నివాస్ ఫేస్--1 అధ్యక్షులు రామారావు , లింగేశ్వర రావు , సురేష్ , బీజేపీ నాయకులు వగ్గుల సుందర్ నారాయణ , వైద్య సిబ్బంది, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన బీఆర్ఎస్ నాయకులు వడ్త్య రమేష్



**దేవరకొండ డివిజన్ జూన్ 28( మహాప్రభ )** ఆదివారం చందంపేట మండలం తెల్దేవర్ పల్లి గ్రామనికి చెందిన నలావత్ దేవి పకీర నాయక్ లా కుమారుడి అఖిల్ రాథోడ్ అనిత లా రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

## పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ రేణుక సంజువ్ యాదవ్




**గాంధారి, జూన్ 28 (మహాప్రభ)** కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ మమ్మాయి రేణుక సంజు యాదవ్ మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు చిన్నారులకు రెండు పోలియో చుక్కలు తప్పనిసరి వేసుకోవాలని తెలిపారు. తమ పిల్లలను సమీప పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి చుక్కలు వేయించాలని అధికారులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాస్కర్ గౌడ్, వార్డ్ మెంబర్ నితిన్ పాటిల్, వార్డ్ మెంబర్స్, ఆశావర్కర్స్, అంగన్వాడీ టీచర్స్, ఆరోగ్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 5095 చిన్నారులకు పోలియో చుక్కలు



**పాపన్నపేట, జూన్ 28 ( మహా ప్రభ )** పాపన్నపేట మండల వ్యాప్తంగా ఏడుపాయల,పాపన్నపేట ఆయా గ్రామాల్లో..పాపన్నపేట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం పరిధిలో 2827 మంది,పొడ్చన్ పల్లి ఆరోగ్య కేంద్రం పరిధిలో 2268 మంది చిన్నారులకు వైద్యాధికారులు,సిబ్బంది ఆదివారం పల్స్ పోలియో చుక్కలు వేశారు. 5 ఏండ్ల లోపు చిన్నారులను వారి తల్లిదండ్రులు ఉదయం నుండే కేంద్రాలకు చేరుకున్నారు. వైద్యాధికారులు,అన్వర్,దీక్ష,సిబ్బంది చందర్,అలీ,గ్రామ సర్పంచులు..పావని గౌడ్,శ్రీధర్,సిద్దప్ప,శేఖర్,ఏసు,సుశీల తదితరులు ఉన్నారు.

## ఉరి వేసుకుని ఓ యువకుడు మృతి





**గాంధారి, జూన్ 28 (మహాప్రభ)** మద్యం మత్తులో యువకుడు తన భార్య ఫోన్ లిఫ్ట్ చెయ్యలేదని ఓ యువకుడు ఆత్మహత్య గాంధారి మండల కేంద్రంలో ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం రోజు భోగం రవీందర్ తండ్రి నారాయణ 30 సంవత్సరాలు మద్యం మత్తులో తన భార్య ఫోన్ లిఫ్ట్ చేయలేదు. అని కోపంతో సంగెం రేవు శివారులో ఉరివేసు కొని మృతుని భార్య దరఖాస్తు మేరకు కేసు నమోదు చేయనైనది.ఎస్ఐ పేర్కొన్నారు. రవీందర్ కి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# కొత్తపల్లిలో పోలియో చుక్కల సందడి





**పాపన్నపేట, జూన్ 28( మహాప్రభ)** మండల పరిధి లోని కొత్తపల్లి గ్రామంలో చిన్నారులకు ఆదివారం వైద్య సిబ్బంది,గ్రామసర్పంచ్ పద్మా జగన్నాథం పోలియో చుక్కలు వేశారు. పాపన్నపేట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం పరిధిలో 2827 మంది,పొడ్చన్ పల్లి ఆరోగ్య కేంద్రం పరిధిలో 2268 మంది చిన్నారులకు వైద్యాధికారులు,సిబ్బంది ఆదివారం పల్స్ పోలియో చుక్కలు వేశారు. 5 ఏండ్ల లోపు చిన్నారులను వారి తల్లిదండ్రులు ఉదయం నుండే కేంద్రాలకు తీసుకువచ్చారు. వైద్యాధికారులు,అన్వర్,దీక్ష ఆధ్వర్యంలో ఈకార్యక్రమం సందడిగా సాగింది.

# గ్రామ గ్రామాన పల్స్ పోలియో కార్యక్రమం





**గాంధారి జూన్ 28 (మహాప్రభ)** కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల కేంద్రం తో పాటు భూంపల్లి, జనగాం, లింగంపల్లి, తుక్కుజివాడి, తిమ్మాజివాడి, ఉత్తనూర్, వజ్జపల్లి, వజ్జపల్లి తండా. యాచారం తండా సజ్జనాయక్ తాండ. పూర్వ నాయక్ తాండ.తగ్గి కల్వరాల్. పద్మా జీవడి మొదేగం.అడ్లూరు ఎల్లారెడ్డి మర్కల్ తిరుమన పల్లి కుప్రియాల్ ధర్మరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈరోజు నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా జరిగింది. మొత్తం 3,044 మంది 5 సంవత్సరాల లోపు చిన్నారులు లక్ష్యంగా ఉండగా, 96.4% కవరేజ్ సాధించి 2,934 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయబడినాయి. ఈ కార్యక్రమంలో 80 మంది సిబ్బంది ( ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, వాలంటీర్లు), 2 సూపర్వైజర్ బృందాలు, 1 మొబైల్ టీమ్, 1 ట్రాన్సిట్ టీమ్ పాల్గొని 19 పోలియో బూత్‌ల ద్వారా సేవలు అందించారు. బూత్‌లో పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన చిన్నారులను గుర్తించి, రాబోయే 2 రోజుల పాటు ఏఎన్ఎం మరియు ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారు. ఐదు సంవత్సరాల లోపు ఏ చిన్నారి కూడా పోలియో చుక్కలు మిస్ కాకుండా తల్లిదండ్రులు పూర్తి సహకారం అందించాలని సదాశివనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. అస్మా అఫ్షీన్ కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ డిపార్ట్మెంట్ నాగరాజు, ఏఎన్ఎమ్ లు ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా బిజెపి కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించిన జాతీయ కమల దళపతి

-మెదక్ జిల్లా కాషాయ మయం
-ఎంపీ రఘునందన్ రావులతో పాటు పాల్గొన్న వర్గంటి రామ్మోహన్ గౌడ్
-తెలంగాణలో కాషాయ జెండా ఎగరవేయడమే లక్ష్యం
-పార్టీ బలోపేతం కోసం ప్రతి నాయకుడు కార్యకర్తల కృషి చేయాలి
-ప్రజా సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంది





**మెదక్ జూన్ 28,(మహాప్రభ)** మెదక్ జిల్లా బిజెపి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన జాతీయ కమల దళపతి నితిన్ నవీన్ ప్రారంభించారు ఆయన ఈ కార్యాలయంతో పాటు రాష్ట్రంలో మరో ఎనిమిది జిల్లాల కార్యాలయాలను వర్చువల్ విధాల ద్వారా ఘనంగా ప్రారంభించారు తెలంగాణ పార్టీ సంస్థ గత బలోపితం కోసం ఈ పర్యటనలో భాగంగా ఎల్లవేళలా కృషి చేస్తానని అన్నారు. తెలంగాణలో కాషాయ జెండా ఎగరవేయడమే మన పార్టీ లక్ష్యం అని అన్నారు మెదక్ ఎంపీ రఘునందన్ రావు ల తో పాటు రాష్ట్ర నాయకులు వర్గంటి రామ్మోహన్ గౌడ్ పార్టీ బలోపేతం కోసం ప్రతి నాయకుడు కార్యకర్తల అకుంఠిత దీక్షతో కృషి చేయాలి పార్టీలో సిద్ధాంతానికి భావజాలానికి కట్టుబడి ఉన్న ప్రతి కార్యకర్తను అధిష్టానం తప్పకుండా గుర్తిస్తుంది పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలను అధిష్టానం ఎల్లవేళలా కాపాడుకుంటుంది కార్యకర్తల బలమే పార్టీ విజయానికి సోపానాలు ఢిల్లీ నుండి గల్లి వరకు ప్రజా సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం ప్రతి తరం గుర్తించేలా అభివృద్ధి వైపు బాటలు వేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో జాతీయ రాష్ట్ర జిల్లా నాయకులు మరియు అధిక సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లా బి జె పి పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం.

**మెదక్ జిల్లా. జూన్ 28.(మహాప్రభ )** మెదక్ జిల్లా బిజెపి కార్యాలయాన్ని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆన్ లైన్ పద్ధతి లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.అనంతరం ఎంపీ రఘునందన్ రావు శిల పలకాన్ని ప్రారంభించిన అనంతరం మెదక్ జిల్లా జిల్లా అధ్యక్షుడు వల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ బీజేపీ జెండా ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ భారతదేశంలో ఏ రాజకీయ పార్టీకి లేనటువంటి కార్యాలయం బీజేపీకి ఉందన్నారు. భవిష్యత్తులో పార్టీ కార్యక్రమాలు ఇక్కడి నుండి అమలు అవుతాయని, నేను ఎమ్మెల్యే గా, ఎంపీ గా పోటీ చేసినప్పుడు అద్దె భవనాల్లో చాలా ఇబ్బందిగా ఉండేదని తెలిపారు. ఇప్పుడు పార్లమెంట్ పరిధిలో మెదక్, సిద్ధిపేట లో భారతీయ జనతా పార్టీ కార్యాలయాలు ప్రారంభించుకోవడం సంతోషం గా ఉందని అన్నారు. ఈ కార్యాలయం పునాది నుండి శంఖు స్థాపన వరకు కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎనిమిది రాష్ట్రాలకు అధ్యక్షునిగా ఉన్న నితిన్ ఏడు రాష్ట్రాలను అధికారంలోకి తెచ్చాడని,



పశ్చిమ బెంగాల్ గెలుపు తరువాత మిగిలిన తెలంగాణ లో బిజెపి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా అయన కృషి చేస్తారని పేర్కొన్నారు. మనం ప్రారంభించుకున్న ఈ కార్యాలయం 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో పంచాయతీ, వార్డు మెంబర్ నుంచి పార్లమెంటు మెంబర్ వరకు ప్రతి ఒక్కరు భారతీయ జనతా పార్టీ నుంచి ఉండాలని కోరారు. నా గెలుపు కోసం ఏ విధంగా బిజెపికి పార్టీ కార్యకర్తలు కష్టపడ్డారో అదే విధంగా మీ వెంటే నేను ఉంటానాని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెసు, బిఆర్ఎస్ పార్టీలు రెండు ఖతమయ్యాయని పేర్కొన్నారు. రెండు పార్టీలు అవినీతిని బహిర్గతం చేస్తూ తెలంగాణలో బిజెపి పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్,మాజీ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి లు సురేష్, శ్రీనివాస్, ఈర్ల రంజిత్ రెడ్డి, జిల్లా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు మల్లికా, నాయకులు తాళ్ళపల్లి రాజశేఖర్, పంజా విజయ్, కవిత రెడ్డి, నందరెడ్డి. ప్రసాద్.తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## రికార్డు స్థాయిలో దిగి వస్తున్న బంగారం, వెండి ధరలు.. హైదరాబాద్‌లో ఎంతంటే..!

గత కొన్ని నెలలుగా బంగారం, వెండి ధరలు వేగంగా పెరుగుతూ వచ్చాయి. కానీ 2026 జూన్‌లో బంగారం, వెండి విలువైన లోహాల ధరలు అందరినీ ఆశ్చర్యపరిచాయి. గత కొన్ని రోజులుగా బంగారం, వెండి ధరలలో గణనీయమైన తగ్గుదల కనిపించింది. మల్టీ-కమోడిటీ ఎక్స్ఛేంజ్ (వీజఠ)లో, జూన్ 1 నుండి బంగారం ధర 10 గ్రాములకు దాదాపు రూ.15,000 మేర పడిపోయింది. ఇది 9.73% తగ్గుదల. అదేవిధంగా వెండి ధర కిలోకు దాదాపు రూ.45,000 మేర తగ్గింది. అయితే ప్రస్తుతం దేశంలో బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. జూన్ 28న దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.. ముఖ్యంగా ఈ ధరలు ఉదయం 6 గంటలకు నమోదైవి మాత్రమే. రోజులో పెరగవచ్చు.. తగ్గవచ్చు.. లేదా స్థిరంగా కొనసాగవచ్చు.



హైదరాబాద్ -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43,950 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,31,950 వద్ద కొనసాగుతోంది.

విజయవాడ -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43,950 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,31,950 వద్ద కొనసాగుతోంది.

ఢిల్లీ- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,100 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,32,100 వద్ద కొనసాగుతోంది.

ముంబై -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43,950 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,31,950 వద్ద కొనసాగుతోంది.

బెంగళూరు -24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43,950 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,31,950 వద్ద కొనసాగుతోంది.

కోల్‌కతా -24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43,950 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,31,950 వద్ద కొనసాగుతోంది.

చెన్నై -24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,860 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,33,700 వద్ద కొనసాగుతోంది.

ఇక వెండి విషయానికొస్తే ఈ లోహం కూడా రోజురోజుకు భారీ స్థాయిలో దిగి వస్తోంది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,40,000 వద్ద ట్రేడవుతోంది.

## నయా హీరో ప్యాషన్ ప్లస్

**ధర రూ.84 వేలు**



**న్యూఢిల్లీ,**

ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ హీరో..దేశీయ మార్కెట్‌కు మరో మాడల్‌ను పరిచయం చేసింది. ప్యాషన్ ప్లస్‌లోనే డిస్క్ బ్రేక్ రకాన్ని తీసుకొచ్చింది. దేశవ్యాప్తంగా ఎంట్రీలెవల్ మోటర్‌సైకిళ్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ నయా మాడల్‌ను తీసుకొచ్చినట్టు, ఈ బైకు ధర రూ.84.128గా నిర్ణయించింది. ఈ ధరలు న్యూఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. పాత మాడల్‌తో పోలిస్తే ఈ నయా మాడల్‌ను సరికొత్తగా తీర్చిదిద్దినట్టు, పూర్తిస్థాయిలో డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, మైలేజీ ఇండికేట్, తక్కువ పెట్రోల్ వార్నింగ్, సర్వీసెస్ రిమైండర్, యూఎస్‌బీ చార్జింగ్ పాయింట్, బ్లూటూత్ కనెక్టివిటీతో కాల్, ఎస్ఎంఎస్ అలర్ట్‌ను తిలకించవచ్చునని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. 100 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ బైకు 5.9 కిలోవాట్ల శక్తినివ్వనున్నదని, లీటర్ పెట్రోల్‌కు 71 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది.

## ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లో స్మార్ట్‌ఫోన్‌లపై భారీ తగ్గింపులు

ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ తమ సేల్స్‌లో స్మార్ట్‌ఫోన్‌లపై భారీ తగ్గింపులను ప్రకటించాయి. ఫ్లిప్‌కార్ట్ 'గోట్ సేల్'లో భాగంగా ఐఫోన్ 17పై రూ.12,000 వరకు, ప్రో మోడల్స్‌పై రూ.22,000 వరకు డిస్కౌంట్లు జులై 4 నుంచి లభించనున్నాయి. అమెజాన్ ప్రైమ్ డే సేల్‌లో శాంసంగ్ గెలాక్సీ ఎస్25 ఆల్ట్రా 5జీ ఫోన్‌పై భారీ తగ్గింపు జులై 4-6 మధ్య అందుబాటులో ఉంటుంది. రెండు సేల్స్‌లోనూ బ్యాంక్ ఆఫర్లు, నో కాస్ట్ ఈఎంఐ వంటి అదనపు ప్రయోజనాలు ఉన్నాయి




# స్పోర్ట్స్

## అంతర్జాతీయ క్రికెట్‌కు స్టోక్స్ గుడ్ బై

**-న్యూజిలాండ్‌తో జరిగే టెస్టే ఆఖరి మ్యాచ్**

**-ఎమోషనల్ స్టేట్‌మెంట్ ఇచ్చిన స్టోక్స్**

ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై రిటైర్మెంట్ ప్రకటిస్తూ అందరికీ షాక్ ఇచ్చాడు. న్యూజిలాండ్‌తో నాటింగ్‌హామ్ వేదికగా జరుగుతున్న మూడో టెస్టు మధ్యలోనే తన రిటైర్మెంట్ ప్రకటించి అందర్నీ ఆశ్చర్యానికి గురి చేశాడు. బెన్ స్టోక్స్ డెసిషన్‌కు టీమ్‌మేట్స్‌తో పాటు క్రికెట్ అభిమానులు కూడా ఇంకా షాక్‌లోనే ఉన్నారు.న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడో టెస్టు మధ్యలో బెన్ స్టోక్స్ మాట్లాడుతున్న ఒక వీడియోను ఇంగ్లండ్ క్రికెట్ తన అధికారిక సోషల్ మీడియా అకౌంట్‌లో పోస్ట్ చేసింది. కెప్టెన్‌గా, ఇంగ్లండ్ తరఫున కూడా తాను ఆడే చివరి రెండు రోజులు ఇవే అంటూ స్టోక్స్ చెప్పాడు. తన రిటైర్మెంట్‌కు అసలు కారణాలు త్వరలోనే చెబుతాను అని చెప్పడం ఆశ్చర్యానికి గురి చేసింది. బెన్ స్టోక్స్ మాట్లాడుతూ "రాబోయే రెండు రోజుల్లో ఒక విషయం జరగబోతోంది. ఇవే మీ కెప్టెన్‌గా నా చివరి రెండు రోజులు కూడా. అలాగే ఇంగ్లండ్ తరఫున ఆడే నా చివరి రెండు రోజులు కూడా. దీనికి కారణాలు తర్వాత



చెబుతాను. ఈ జట్టు కోసం, మీ కోసం, ఇంతకుముందు ఉన్న వాళ్ల కోసం నేను ఎన్నోసార్లు నా శక్తినంతా పెట్టాను. ఇప్పుడు కూడా మరోసారి అదే చేయబోతున్నాను " అని అన్నాడు.నేను కోరేది ఒక్కటే మీలో ప్రతి ఒక్కరూ కూడా జట్టు కోసం పోరాడాలి. ఇంకా మన ముందున్న రెండు రోజుల్లో చాలా పని ఉంది. మ్యాచ్ ఫలితం ఎలా వచ్చినా, ఈ జట్టులోని ప్రతి ఆటగాడు, ఒక మహిళా సిబ్బంది సభ్యురాలు కూడా తమ శక్తినంతా పెట్టారని భావిస్తూ మైదానం వీడాలని కోరుకుంటున్నాను. నా కోసమే కాదు, ఈ జట్టు భవిష్యత్ కోసం కూడా అందరూ తమ శాయశక్తులా పోరాడాలి. భావోద్వేగాలు, అభినందనలు అన్నీ ఈ మ్యాచ్ ముగిసిన తర్వాత చూసుకుందాం. ఇప్పటికైతే మైదానంలోకి వెళ్లి మరో రెండు రోజులు పూర్తి స్థాయిలో పోరాడుదాం" అని బెన్ స్టోక్స్ ముగించాడు.35 సంవత్సరాల బెన్ స్టోక్స్ 2011లో ఇంగ్లండ్ తరఫున వైట్ బాల్ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. 2022 నుంచి టెస్టు జట్టుకు కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. ఇంగ్లండ్ తరఫున ఎన్నో అద్భుత ప్రదర్శనలు చేశాడు. ముఖ్యంగా యాషెస్ సిరీస్‌లో సెంచరీ చేసి ఒంటి చేత్తో మ్యాచ్ గెలిపించిన దాన్ని క్రికెట్ అభిమానులు ఎవ్వరూ మరచిపోలేరు. న్యూజిలాండ్‌తో మొదటి టెస్టు తర్వాత నైట్ క్లబ్‌లో రగ్బీ ప్లేయర్‌తో జరిగిన వివాదమే స్టోక్స్ రిటైర్మెంట్‌కు ప్రధాన కారణమని తెలుస్తోంది.

## సెమీస్‌లో వెస్టిండీస్.. డిఫెండింగ్ ఛాంపియన్ ఔట్..!




మహిళల టీ20 ప్రపంచకప్ నుంచి న్యూజిలాండ్ నిష్క్రమించింది. చివరి లీగ్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ చేతిలో భారీ ఓటమితో ఉసూరుమంటూ ఇంటిదారి పట్టింది వైట్ ఫెర్న్స్. డిఫెండింగ్ ఛాంపియన్‌గా లీగ్‌లో అడుగు పెట్టిన కివీస్.. పేలవమైన ప్రదర్శనతో వెనకబడింది. ఇంగ్లండ్‌పై గెలిస్తే ముందుకెళ్లే అవకాశమున్నా.. సమిష్టి వైఫల్యంతో వెస్టిండీస్‌కు మార్గాన్ని సుగమం చేసింది.కెన్నింగ్‌టన్ ఓవల్ మైదానంలో ఇంగ్లండ్ ధాటికి న్యూజిలాండ్ చేతులెత్తేసింది. 163 రన్స్ కొట్టినా మ్యాచ్‌ను కాపాడుకోలేక లీగ్ దశలోనే కివీస్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఓపెనర్లు మేలియా కేర్(42), ఇసబెల్లా గేజ్(28)లు దూకుడుగా ఆడి 70 రన్స్‌తో శుభారంభమిచ్చారు. కానీ, ఇంగ్లండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొని మిడిలార్డర్ పరుగులు చేయకపోవడంతో భారీస్కోర్ సాధ్యపడలేదు.ఇక ఛేదనలో అమీ జోన్స్(17) విఫలమైనా..డానీ వ్యాట్(89 నాటౌట్), సోఫియా డంక్లే(49)లుబౌండరీలతో చెలరేగి. వైట్ ఫెర్న్స్ బౌలింగ్ దళానికి చుక్కలు చూపించిన ఈ ద్వయం 9 వికెట్లతో ఇంగ్లండ్‌ను గెలిపించింది. దాంతో.. గ్రూప్ బీ నుంచి సెమీస్ బెర్తులు ఖరారయ్యాయి. ఐదుకు ఐదు విజయాలతో ఇంగ్లండ్ నాకౌట్‌కు దూసుకెళ్లగా.. ఐర్లాండ్ చేతిలో ఓడినప్పటికీ వెస్టిండీస్ సెమీస్ బెర్తు దక్కించుకుంది. చావోరేవో మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఓడడం విండీస్‌కు కలిసొచ్చింది.


## రో-కోపై ఏదో ఒకటి తేల్చేయండి': అశ్విన్

**-వన్డే ప్రపంచకప్ 2027లో రో-కో ఆడాలి: అశ్విన్**

**-రోహిత్, కోహ్లీలపై నెగెటివ్ ప్రచారాలపై ఫైర్**

**-సెలక్టర్లు ఇప్పుడే నిర్ణయం తీసుకోవాలని సూచన**

టీమిండియా స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ .. భవితవ్యంపై భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. వన్డే ప్రపంచకప్ 2027లో ఆడటమే లక్ష్యంగా రోహిత్, కోహ్లీ అడుగులు వేస్తున్నారు. కానీ వారు ఈ మెగా టోర్నీలో ఆడతారా.. లేదా అనే అంశంపై బీసీసీఐ ఇప్పటివరకు స్పష్టత ఇవ్వడం లేదు. కొందరు.. రోకో ప్రపంచకప్ ఆడరని.. మరికొందరు ఆడాలని కామెంట్లు చేస్తున్నారు. ఇదే విషయంపై అశ్విన్ మాట్లాడాడు. వీరిపై సెలక్టర్లు వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని సూచించాడు. ఇటీవల కాలంలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ గురించి వస్తున్న వార్తలు బాలేవు. కొందరు పనిగట్టుకుని నెగెటివ్ ప్రచారం చేస్తున్నారు. అసలు ఎక్కడ నుంచి ఇలాంటి నెగెటివ్ ప్రచారం వస్తోందో తెలియడం లేదు. కొందరు




మాత్రం ఈ ఇద్దరు ప్రపంచ కప్‌లో ఆడకూడదని గట్టిగా కోరుకుంటున్నారు. ఎందుకు ఇలాంటి ఆలోచన చేస్తున్నారో మాత్రం అర్థం కావడంలేదు. కొందరేమో వారు ఆడకపోవచ్చని అనుమానాలు వచ్చేలా మాట్లాడుతున్నారు. మరికొందరు మాత్రం రో-కో ఉంటేనే బాగుంటుందంటారు. నా వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం వన్డే ప్రపంచకప్ 2027లో రోహిత్, కోహ్లీ తప్పకుండా ఆడాలి" అని అశ్విన్ వ్యాఖ్యానించాడు. ఇదే సమయంలో అశ్విన్.. భారత సెలక్టర్లకు కీలక సూచన చేశాడు. "దక్షిణాఫ్రికా వేదికగా జరిగే వన్డే ప్రపంచ కప్‌లో కోహ్లీ, రోహిత్ ఉండాలని మీరు కోరుకుంటే.. ఇప్పుడే నిర్ణయం తీసుకోండి. అలా చేయడం వల్ల టోర్నీ నాటికి వారు పూర్తి సన్నద్ధతతో, విశ్వాసంతో ఉంటారు. ఒకవేళ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే.. మున్ముందు ఈ అంశం మరింత సంక్లిష్టంగా మారుతుంది. గందరగోళానికి దారి తీస్తుంది" అని రవిచంద్రన్ అశ్విన్ తన మనసులోని మాటను బయటపెట్టాడు. రోహిత్, కోహ్లీ టెస్ట్, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించి కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నారు. రోహిత్ ఇటీవల అఫ్ఘాన్‌తో వన్డే సిరీస్‌లో రాణించాడు. గాయం కారణంగా కోహ్లీ ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. వచ్చే నెలలో ఇంగ్లాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో వీరిద్దరూ పాల్గొనే అవకాశం ఉంది.



## కొత్త లుక్‌లో కేక పుట్టిస్తోన్న పూజా హెగ్డే..

# పారిపోయి పెళ్లి చేసుకుందాం అనుకున్నా..

### కానీ ఇలా జరుగుతుందని అనుకోలేదు : స్టార్ హీరోయిన్



సినీ సెలబ్రెటీల వ్యక్తిగత జీవిత ఎప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా చక్కర్లు కొడుతూనే ఉంటుంది. ముఖ్యంగా ప్రేమలు పెళ్లికి సంబంధించిన ఎన్నో న్యూస్ చక్కర్లు కొడుతూ ఉంటాయి. ఇటీవల చాలా మంది సెలబ్రెటీలు పెళ్లి చేసుకొని కొత్త జీవితాలను మొదలుపెడుతుంటే.. మరికొందరు విడాకులు అనౌన్స్ చేస్తూ అభిమానులకు షాక్ ఇస్తున్నారు. యంగ్ హీరోలు, యంగ్ హీరోయిన్స్ మాత్రమే కాదు సీనియర్ హీరోలు కూడా విడిపోతున్నాం అంటూ అనౌన్స్ చేసి అవాక్ అయ్యేలా చేస్తున్నారు. ఇటీవలే ఓ స్టార్ హీరోయిన్ పెళ్లి చేసుకొని అభిమానులకు షాక్ ఇచ్చింది. తెలుగులో తక్కువ సమయంలోనే ఈ అమ్మడు స్టార్ డమ్ సొంతం చేసుకుంది. ఇటీవలే ఈ అమ్మడు ప్రేమించి పెళ్లి చేసుకుంది. పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకొని కొత్త జీవితాన్ని ప్రారంభించింది. పెద్దలు ఒప్పుకోకపోతే పారిపోయి పెళ్లి చేసుకుందాం అనుకున్నా అని తెలిపింది అందాల భామ కీర్తిసురేష్. తెలుగులో తక్కువ సమయంలో విపరీతమైన క్రేజ్ తెచ్చుకున్నముద్దుగుమ్మల్లో కీర్తిసురేష్ ఒకరు. తమిళ్ ఇండస్ట్రీ నుంచి తెలుగులోకి అడుగుపెట్టింది ఈ అమ్మడు. రామ్ పోతినేని హీరోగా నటించిన నేను శైలజ సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది కీర్తి. ఆ తర్వాత వరుసగా సినిమాలు చేసింది. ఇక మహానటి సినిమాతో తెలుగులో ప్రేక్షకులకు మరింత దగ్గరైయింది ఈ ముద్దుగుమ్మ. ఆ తర్వాత స్టార్ హీరోల సినిమాల్లో నటించింది కీర్తిసురేష్. మహేష్ బాబు, పవన్ కళ్యాణ్ లాంటి స్టార్ హీరోల సరసన నటించింది. ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకున్న ఈ అందాల భామ.మొన్నామధ్య పెళ్లి చేసుకొని అభిమానులకు షాక్ ఇచ్చింది. తన ప్రియుడు ఆంటోని తటిల్ ను కీర్తి 2024లో వివాహం చేసుకుందివీరిద్దరి పెళ్లి హిందూ, క్రిస్టియన్ సంప్రదాయల ప్రకారం జరిగింది. దాదాపు 15 ఏళ్లు రిలేషన్ లో ఉన్న ఈ ఇద్దరూ పెళ్లి చేసుకొని కొత్త జీవితాన్ని ప్రారంభించారు. పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో యాక్టివ్ గా ఉంది కీర్తి. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రేక్షకులను అలరించింది. కాగా గతంలో ఓ ఇంటర్వ్యూలో కీర్తిసురేష్ మాట్లాడుతూ ఆసక్తికర విషయాలను పంచుకుంది. ఆ ఇంటర్వ్యూలో కీర్తిసురేష్ మాట్లాడుతూ.. ఆంటోనీ గురించి తన ఇంట్లో తెలిస్తే ఖచ్చితంగా మా పెళ్లికి ఒప్పుకోరని అనుకున్నాం.. ఒకవేళ మా పెళ్ళికి ఒప్పుకోకపోతే ఇంటి నుంచి పారిపోయి పెళ్లి చేసుకోవాలనుకున్నా.. కానీ మా ప్రేమ గురించి చెప్పగానే పెద్దలు పెళ్లికి ఒప్పుకున్నారు అలాగే ఎంతో గ్రాండ్ గా పెళ్లి చేశారు. ఇంత గ్రాండ్ గా మా ఫ్యామిలీస్ సమక్షంలో మా పెళ్లి జరుగుతుందని కలలో కూడా ఊహించలేదు.. అందుకే పెళ్లి సమయంలో నేను నా భర్త ఎమోషనల్ అయ్యాం అని చెప్పుకొచ్చింది కీర్తిసురేష్.

## పవనిజం లింక్‌తో 'హే చికీతా'...
## రైతే రాజు కాన్సెప్ట్‌తో టీజర్




బద్రి సినిమాలో హే చికీతా అంటూ వచ్చే పవన్ కల్యాణ్ సాంగ్ బాక్సాఫీస్‌ను ఏ రేంజ్‌లో షేక్ చేసిందో తెలిసిందే. అప్పటికీ ఎప్పటికీ ఆల్‌టైమ్ ఫేవరేట్ సాంగ్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. పవన్ కల్యాణ్ మ్యానరిజం టచ్ చేస్తూ 'హే చికీతా' టైటిల్‌లో సినిమా చేస్తూ మూవీ లవర్స్ ఫోకస్ తనవైపు తిప్పుకుంటున్నాడు డైరెక్టర్ ధన్ రాజ్ లెక్కల. ఈ మూవీలో టెలివిజన్ స్టార్ యాక్టర్, సినీ నటుడు ప్రభాకర్ కూతురు దివిజ హీరోయిన్‌గా నటిస్తోండగా.. ప్రభాకర్ కీలక పాత్రలో నటిస్తున్నాడు.అభినవ్ మణికంఠ హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని జులై 24న విడుదల చేస్తున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా పాపులర్ సినిమాటోగ్రఫర్ కేకే సెంథిల్ కుమార్ టీజర్‌ను లాంచ్ చేశాడు. ఓ వైపు లవ్, రిలేషన్స్, మరోవైపు వ్యవసాయం వంటి అంశాలను సినిమాలో చూపించబోతున్నట్టు టీజర్ చెబుతోంది. డైరెక్టర్ ధన్ రాజ్‌లెక్కల మాట్లాడుతూ.. ఊరిలో ఉండే ఓ ఐదుగురు పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ ఏం చేశారనేదే సినిమా కథ అని.. అందుకే ఈ హే చికీతా టైటిల్ పెట్టాం. పవన్ కల్యాణ్ ప్రతీ సినిమాలో ఇంట్రో సాంగ్‌లో 3 నిమిషాల పాటు మెసేజ్ ఇస్తారు.. నేను కూడా అదే లైన్‌లో రైతుల గురించి 3 గంటలపాటు సినిమా చేశానన్నాడు.సుందరకాండ మోషన్ పిక్చర్స్, ఎల్ఎల్‌పీ బ్యానర్లపై గరుడ వేగ ఫేం అంజి, ఎన్ అశోక్ ఆర్ఎన్ఎస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీలో తన్మయి కుషి, దేవీ ప్రసాద్, బలగం సుజాత, అంజిమామ ఇతర నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## ఆ హీరోతో నటించాలంటే చాలా భయమేసింది..

టాలీవుడ్ హీరోయిన్ నభా నటేష్ ఇప్పుడు చాలా బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆమె నాగబంధం అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషన్లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె తన కెరీర్, రాబోయే ప్రాజెక్టులు, వివిధ సహనటులతో కలిసి పనిచేసిన అనుభవాలపై ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ప్రధానంగా, కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ తో తన తొలి సినిమా షూటింగ్ అనుభవం గురించి ఆమె మాట్లాడారు.ప్రస్తుతం నాభా నటేష్ నాగబంధం అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ కథ తనని ఎంతగానో ఆకట్టుకుందని, పాత జానపద కథలను, ఫెయిరీ టేల్స్ ను గుర్తుచేస్తుందని ఆమె తెలిపారు. గతంలో ఏ చిత్రంలోనూ అన్వేషించని కొన్ని అంశాలను నాగబంధం ద్వారా చూపించనున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ చిత్రంతో పాటు స్వయంభు అనే మరో ఫాంటసీ చిత్రంలో కూడా ఆమె నటిస్తున్నారు. నాగబంధం కన్నా ముందే స్వయంభుకు సంతకం చేశానని, మైథలాజికల్ లేదా పీరియాడిక్ స్పేస్ లో తనకు అదే తొలి అనుభవమని నాభా నటేష్ వివరించారు.స్వయంభు సెట్స్ లోకి అడుగుపెట్టినప్పుడు, కాస్ట్యూమ్స్ ధరించినప్పుడు టైమ్ ట్రావెల్ చేసిన భావన కలిగిందని, ఆ వాతావరణం చాలా అందంగా ఉందని ఆమె అన్నారు. స్వయంభులో తన పాత్ర పార్వతితో పోలిస్తే చాలా భిన్నంగా, శక్తివంతంగా ఉంటుందని తెలిపారు. స్వయంభులో తన సహనటుడు నిఖిల్ సిద్ధార్థతో కలిసి పనిచేసిన అనుభవం గురించి మాట్లాడుతూ, ఆయన చాలా సరదాగా, ప్రతిభావంతుడిగా, కష్టపడే తత్వం కలవాడు అని అన్నారు.నిఖిల్ ఎంతో అవుట్ స్పోకెన్ అని, ఎటువంటి విషయాలు దాచుకోడని, ఫుట్ బాల్, జీవితం గురించి మాట్లాడటానికి ఆసక్తి చూపుతాడని ఆమె చెప్పారు. నిఖిల్ నటించిన కార్తికేయ 2 సినిమా తనకు చాలా ఇష్టమని, ఆ సినిమాను పదిసార్లు చూశానని, దానిలోని కృష్ణ ట్యూన్ ఎంతో బాగుంటుందని నభా నటేష్ అన్నారు. తన వ్యక్తిగత లక్షణాల గురించి మాట్లాడుతూ, తన బలం, బలహీనత రెండూ ఒకటేనని, అది ప్రతి దానిలో మంచిని చూడటమేనని నభా నటేష్ తెలిపారు.తన కెరీర్ కన్నడలో ప్రారంభమైందని నాభా నటేష్ గుర్తుచేసుకున్నారు. అక్కడ కన్నడ సూపర్ స్టార్, కరుణాడ చక్రవర్తి శివరాజ్ కుమార్ తో తన తొలి సినిమాలో నటించే అవకాశం లభించిందని ఆమె తెలిపారు. శివరాజ్ కుమార్ స్థాయిని చూసి మొదట్లో చాలా భయం వేసిందని, అప్పట్లో గుర్రం నడపడం, బీడీ తాగడం వంటి మాస్ లక్షణాలు ఉన్న ఒక క్లిష్టమైన పాత్రను చేశానని నాభా నటేష్ వివరించారు. మళ్లీ అలాంటి మాస్ పాత్రను చేయలేదని ఆమె అన్నారు. ఆయన చిత్రాలను చూసిన తనకు, ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా భయమేసిందని నభా నటేష్ పేర్కొన్నారు.



## ఆకట్టుకుంటున్న 'హ్యాపీ జర్నీ' టీజర్!




విభిన్న వయసులు, భిన్న మనస్తత్వాలు కలిగిన ఏడుగురు మహిళలు కలిసి ప్యారిస్ వెకేషన్‌కు వెళ్తే ఎలాంటి క్రేజీ అనుభవాలు ఎదురయ్యాయి అనే ఆసక్తికరమైన కథాంశంతో టాలీవుడ్‌లో సరికొత్త చిత్రం తెరకెక్కుతోంది. అభిరామ్ నాయుడు దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ 'హ్యాపీ జర్నీ' చిత్ర అధికారిక టీజర్ తాజాగా విడుదలై సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. సాధారణంగా వచ్చే కమర్షియల్, పురుష ప్రధాన సినిమాలకు భిన్నంగా, పూర్తిగా మహిళల ఎమోషనల్ బాండింగ్ మరియు రోడ్-ట్రిప్ చుట్టూ తిరిగే హార్ట్-వార్మింగ్ డ్రామాగా ఈ సినిమా రూపొందింది. తమ జీవితాల్లోని బాధలు, ఒత్తిడిని మర్చిపోవడానికి ప్యారిస్ ప్రయాణమైన ఏడుగురు మహిళల జీవితాలు అక్కడ ఎలాంటి మలుపు తిరిగాయనేది ఈ చిత్రంలో చూపించబోతున్నారు.ఈ సినిమాలో సీనియర్ నటీమణులు అన్నపూర్ణమ్మ, ఆమనిలతో పాటు యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జినిషా అలీశెట్టి, రూపా శ్రీనివాస్, సునయన ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్యారిస్ బ్యాక్‌డ్రాప్‌లో అన్నపూర్ణమ్మ, ఆమనిల సందడి ఈ టీజర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే వంశీధర్ గౌడ్, పృథ్వీ దండమూడి, రవి శివతేజ పైలా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాను గుట్ట ప్రొడక్షన్స్ మరియు కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ పతాకాలపై బాలాజీ గుట్ట, కౌశిక్ రెడ్డి నిర్మిస్తుండగా, తరుణ్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. శేఖర్ చంద్ర సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి మణికందన్ సుబ్రమణియన్ సినిమాటోగ్రఫీ, ఛోటా కె. ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ప్యారిస్, మాంట్పెలియర్ లాంటి అందమైన యూరోపియన్ లొకేషన్లలో రిఫ్రెషింగ్ విజువల్స్‌తో రూపొందిన ఈ చిత్రం త్వరలోనే థియేటర్లలో సందడి చేయనుంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com